Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 17 | సంచిక: 29 | కరీంనగర్ | మంగళవారం 23 జూన్ 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## తల్లి మందలింపుతో పారిపోయిన అక్కాచెల్లెళ్లు

### ఏలూరులో ప్రత్యక్షమైన సోదరీమణులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్22:తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. హైదరాబాద్‌లో అదృశ్యమైన ఆ ముగ్గురూ ఏపీలో ప్రత్యక్షమయ్యారు. ఈ ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫోన్ ఎక్కువగా చూస్తున్నారని తన ముగ్గురు కుమార్తెలను తల్లి మందలించింది. దీంతో ఆ ముగ్గురూ ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో తన పిల్లలు కనిపించడం లేదని వారి తల్లి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. ఏలూరులో ఉన్నట్లు తేలింది. వారిని తిరిగి హైదరాబాద్ తీసుకొస్తున్నారు.

## అమెరికాలో మరో తెలుగు విద్యార్థి మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్22 :ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లిన మరో తెలుగు విద్యార్థి అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయాడు. తెలంగాణకు చెందిన 26 ఏళ్ల అరుణ్ సాయి రెడ్డి బొ÷-లలెందుల అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. అరుణ్ స్వస్థలం మహబూబ్‌నగర్. ప్రస్తుతం ఫ్లోరిడాలోని టెంపాలో నివసిస్తోన్న అతడు.. స్టెమ్ ఓపీటీలో ఉన్నాడు. ఫుల్ టైమ్ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తోన్న అరుణ్.. జూన్ 19న ఉన్నట్టుండి అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# అదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం

- దేవరకద్ర డిఆర్ఎస్ ప్రాజెక్ట్ సత్వరం చేపట్టాలి
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌తో సిఎం రేవంత్ భేటీ
- రక్షణ భూములు కేటాయించినందుకు కృతజ్ఞతలు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, జూన్22 : ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రాష్ట్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు

11 లో

## భూమి గురించి అడిగితే

# ఎస్‌బిఐపై పగబట్టారు

- రాయదుర్గం భూమల వేలంపై హరీష్ రావు ఫైర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబ్‌నగర్,జూన్22 : హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పటి ప్రభుత్వం ఎకరం భూమిచ్చిందని, అయితే...రేవంత్ రెడ్డి బ్యాంక్‌కు ఇచ్చిన భూమిని అమ్మేసిండని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. అంతేగాకుండా ఇప్పుడు ఎస్‌బిఐ మీద పగపట్టిండని మండిపడ్డారు. అచ్చంపేట బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎస్‌బీఐకి ఇచ్చిన భూమిని వేలానికి ఇచ్చిండు.. భూమిని అమ్మేసిండు. అమ్మేస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్టుకు వెళ్లింది. మాకు ఎకరం భూమి ఇచ్చిర్రు. ఇది కూడా ఉచితంగా ఏం ఇయ్యలేదు. మేము దాదాపు రూ.20 కోట్లు పెట్టి ఈ భూమి కొనుక్కున్నమని.. ఈ భూమి మా పొజిషన్‌లో ఉన్నది. పైసల్ పెట్టి కొన్న మా

11 లో

## నటుడు చిరంజీవితో బిజెపి అధ్యక్షుడు రామ్ భేటీ

- మోడీ 12 పాలనపై పుస్తకాలు అందచేత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 22 :తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో విస్తృత చర్చకు దారి తీసింది. గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సినిమాలపైనే దృష్టి సారించిన చిరంజీవిని బీజేపీ కీలక నేత కలవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే అంశంపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 'మహాజన్ సంపర్క్ అభియాన్'

11 లో



## భువనగిరి కోటకు పూర్వ వైభవం

- టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తాం
- రోప్‌వే నిర్మించే అంశాన్ని పరిశీలించిన మంత్రి జూపల్లి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి,జూన్22 : చరిత్ర కలిగిన పురాతన భువనగిరి ఖిల్లాకు పూర్వవైభవం తీసుకొస్తామని టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. దీనికి పర్యాటక శోభ కల్పిస్తామని అన్నారు. సోమవారం ఉదయం భువనగిరి ఖిల్లా పైకి రోప్ వే నిర్మించే స్థలాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫోర్ట్ రిస్టోరేషన్ చేసి చరిత్ర తెలిపేలా మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు. గంటకు మూడు వందల మంది

11 లో

## తెలంగాణ అభివృద్ధికి బిఆర్ఎస్ మోకాలడ్డు

- పదేళ్లలోఎ భ్రష్టు పట్టించిన నేతలే చిల్లర రాజకీయాలు
- హరీష్ రావు, కెటిఆర్‌ల తీరుపై ఎంపి ఆగ్రహం
- సిఎం విజన్‌తో రాష్టాభివృద్ధి చేస్తున్నారని చామల కితాబు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 22 : తెలంగాణ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ఓ విజన్‌తో ముందుకెళ్తుంటే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌తో విద్య, వైద్యం, రైతులకు మేలు చేయాలనే ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు పోతున్నారని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బావ, బామ్మర్దులు ఇష్టాను సారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం భువనగిరిలో ఎంపీ చామల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి సినిమా వాళ్లతో అంటకాగి సినిమా మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయంలో సినిమా మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజల జీవితాలు కేటీఆర్‌కు సినిమాలాగా కనపడుతున్నాయా..అని కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహిం చారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన

11 లో

## ఓట్, సీట్ చోరీలో బిజెపి నిమగ్నం

- సర్ ప్రక్రియ ఓట్ల తొలగింపుకే ప్రాధాన్యం
- ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు వంద ఖాయం
- బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణలో టీపీసీసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హనుమకొండ, జూన్22 : సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు. నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు ఓటును తొలగించే కార్యక్రమం జరుగుతోందని ఆరోపించారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు. ఓట్లేకాదని.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా దొంగిలించారని విమర్శించారు. ఇక దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారు. ఓట్ల

11 లో

### చిట్టినాయుడిని

## వదిలిపెట్టే ప్రసక్తి లేదు

- ఇబ్బంది పెట్టిన ప్రతీ ఒక్కరికీ సమాధానం ఇస్తా
- వర్దన్నపేట కార్యకర్తల భేటీలో కెటిఆర్ ఘాటు హెచ్చరిక




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వరంగల్, జూన్22 : వచ్చే ఐదేళ్లు ఎవ్వరినీ మరచిపోమని, సిఎం చిట్టి నాయుడును అస్సలు వదిలి పెట్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి

11 లో

## ఆర్డీఎస్ నీటిపై రాజీలేదు

- రైతుల ప్రయోజనాలు కాపాడి తీరుతాం
- నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్22 : తెలంగాణ హక్కుల పరిరక్షణెళి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సోమవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించా

11 లో

# ఇందిరమ్మ రాజ్యాం..ఇంటింటా సంక్షోభం

- ప్రజలను విస్మరించి పార్టీ పెద్దల కోసం పాలన - బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ విమర్శలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హనుమకొండ, జూన్ 22 : బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలను ఆదుకుంటే... కాంగ్రెస్ నేతలు వారి పెద్దలను చూసుకుంటున్నారని, పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో రాజకీయం దిగజారిపోయిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చెప్పిన అబద్దాలను నమ్మి.. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టంకట్టారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా సంక్షోభమని విమర్శించారు. మడికొండలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్, సోషల్ మీడియా శిక్షణా తరగతుల కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. రైతులు తీవ్ర

11 లో

## నిరుద్యోగానికి తోడు..ఆర్థిక సమస్యలు

### ఉరేసుకుని యువకుడు బలవన్మరణం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిజామాబాద్,జూన్22:ఎంబీఏ విద్య పూర్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఉద్యోగం లభించకపోవడం, ఉండడానికి సొంత ఇల్లు కూడా లేకపోవడంతో మానసికంగా బాధపడుతూ ఓ యువకుడు మనస్థాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన దోమ్మటి నితిన్ గౌడ్ (27) తమ గ్రామంలో సొంత ఇల్లు లేకపోవడం, అలాగే ఎంబీఏ విద్య పూర్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఉద్యోగం లభించకపోవడంతో మానసికంగా బాధపడుతూ ఉండేవాడని స్థానికులు తెలిపారు. కాగా సోమవారం లోంక గుడి కి వెళ్తున్నానని ఇంటి నుండి తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అనంతరం లోంక తండా దాటిన తర్వాత రోడ్డుపై తన బైకు నిలిపి సమీప అటవీ ప్రాంతంలో టేకు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

# సింగరేణిని లూటీ చేసినవారే నేడు కార్మికుల రక్షకులమంటున్నారు

**- సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్.**
**- బీఆర్ఎస్, కాంగ్రెస్ వల్లే సింగరేణి ఆర్థిక సంక్షోభం.**
**- కార్మికులను రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలని పిలుపు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శ్రీరాంపూర్, జూన్ 22 : బిఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ తీవ్ర విమర్శలు చేస్తూ, "సింగరేణిని లూటీ చేసినవారే నేడు లాఠీ పట్టినట్లుగా కార్మికుల రక్షకులమని చెప్పుకుంటున్నారు" అని వ్యాఖ్యానించారు. సింగరేణి సంక్షోభానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ విధానాలే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. శ్రీరాంపూర్ ఏరియాలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, గత పాలనల్లో సింగరేణి నియామకాలు, మెడికల్ బోర్డు వ్యవహారాలు, బొగ్గు బ్లాకుల కేటాయింపుల్లో తీవ్ర అవకతవకలు జరిగాయని విమర్శించారు. తాడిచెర్ల, కోయగూడెం, జేవీఆర్ ఓసీపీ వంటి గనులను సింగరేణికి దక్కకుండా రాజకీయ ప్రయోజనాల కోసం ప్రైవేటుకు అప్పగించారని ఆరోపించారు. ట్రాన్స్‌కో, జెన్‌కో నుంచి రావాల్సిన సుమారు రూ.30 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండగా, అవి కాంగ్రెస్ పాలనలో రూ.53 వేల కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. ఈ ఆర్థిక భారమే సింగరేణి ప్రస్తుత పరిస్థితికి కారణమని అన్నారు. గుర్తింపు పొందిన కార్మిక సంఘాలు కార్మిక సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని విమర్శించిన ఆయన, రాజకీయ పార్టీల అనుబంధ సంఘాలు కార్మికులను మభ్యపెడుతున్నాయని ఆరోపించారు. మెడికల్ అన్‌ఫిట్ కార్మికుల వారసుల ఉద్యోగ నియామకాల్లో జాప్యం జరుగుతోందని, దీనివల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. సింగరేణి నిధులను రాజకీయ కార్యక్రమాలకు వినియోగించడం, కార్మికులను సభలకు తరలించడం సంస్థపై అదనపు ఆర్థిక భారమని పేర్కొన్నారు. యాజమాన్యం రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా సంస్థ ప్రయోజనాలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికుల కోసం 12వ వేతన ఒప్పందం అమలుకు జేబీసీసీఐ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని అప్పాని శ్రీనివాస్ కోరారు. కార్మికులు రాజకీయ పార్టీలను నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో బిఎంఎస్ నాయకులు నాతడి శ్రీధర్ రెడ్డి, రాజారాం కిరణ్‌కుమార్, ఐలవేణి శ్రీనివాస్, జల్ల తిరుపతి, అప్పాల బీరయ్య, చల్ల ప్రశాంత్, బొమ్మకంటి కిషన్ తదితరులు పాల్గొన్నారు.





# స్మార్ట్ టెంపుల్‌గా కొలానుపాక సోమేశ్వరాలయం

**రూ.5 కోట్లతో అభివృద్ధి :: మంత్రి జూపల్లి కృష్ణారావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 22 : తెలంగాణలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటైన కొలానుపాక శ్రీ సోమేశ్వర స్వామి ఆలయాన్ని స్మార్ట్ టెంపుల్‌గా తీర్చిదిద్దనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం ఆలయాన్ని సందర్శించిన మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ చారిత్రక, పురావస్తు ప్రాధాన్యంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొలానుపాక సోమేశ్వరాలయం తెలంగాణలో అత్యంత ప్రాచీన, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన దేవాలయాల్లో ఒకటని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు, పరిశుభ్రత, డిజిటల్ సేవలు అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు. రూ.5 కోట్ల నిధులతో ఆలయ పరిసరాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన, పర్యాటక మౌలిక వసతుల విస్తరణ చేపట్టనున్నట్లు చెప్పారు. కొలానుపాకను ఆధ్యాత్మిక, వారసత్వ, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేసి దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, పురావస్తు శాఖ సంచాలకులు డాక్టర్ అర్జున్‌రావు, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.









# రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లు, చైన్‌మెన్‌ల సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం

**అమలు కోసం సీసీఎల్ఏ ఆదేశాలు జారీ - ఉద్యోగ వర్గాల్లో హర్షం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 22 : తెలంగాణ రాష్ట్రంలోని రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లు, చైన్‌మెన్‌లకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రొబేషన్ ధృవీకరణ, ఇంక్రిమెంట్లు, సీనియారిటీ ఫిక్సేషన్ అంశాలపై ఉద్యోగుల డిమాండ్లను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ నెల 16న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల అమలుకు సంబంధించి తాజాగా సీసీఎల్ఏ కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శక ఆదేశాలు జారీ కావడం ఉద్యోగ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈసమస్యల పరిష్కారానికిప్రభుత్వంస్పందించడం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లు, చైన్‌మెన్‌లలో ఆశాభావాన్ని పెంచింది. ఉద్యోగుల సేవా పరిస్థితులు, పదోన్నతులు, వేతన సవరణలకు సంబంధించిన అనిశ్చితిని తొలగించే దిశగా ఈ ఆదేశాలు కీలక మలుపుగా భావిస్తున్నారు. ఈ ఉత్తర్వులు అమలు కావడానికి ముందు గత కొంతకాలంగా తెలంగాణ రాష్ట్ర రికార్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ నిరంతరంగా పోరాటం, ప్రతినిధి చర్చలు, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం వంటి చర్యలు చేపట్టింది. రాష్ట్ర అధ్యక్షులు మెట్టు రవీందర్ నాయకత్వంలో సాగిన ఈ కృషి ఫలితంగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు భావిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సోమవారం సీసీఎల్ఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల వెంకటేష్, రాష్ట్ర కోశాధికారి బాలరాజు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు చుంచు శ్రీను, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు షాదుల్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు సత్వరంగా అన్ని జిల్లాల్లో అమలైతే ఉద్యోగుల సేవా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే ఈ నిర్ణయం ఉద్యోగుల మనోస్థైర్యాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి సహకరించిన జిల్లా నాయకత్వం, కార్యకర్తలు మరియు పోరాటంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి అసోసియేషన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మెట్టు రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల వెంకటేష్ మాట్లాడుతూ, "దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న న్యాయమైన డిమాండ్ల సాధన దిశగా ఇది ఒక ముఖ్యమైన మైలురాయి. ఇకపై అమలు దశలో కూడా ఇదే స్పీడ్ కొనసాగాలి" అని పేర్కొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి

**- హాస్టల్, విద్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉండాలి.**
**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ - తంగళ్ళపల్లి లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయంను - ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రాజన్న సిరిసిల్ల, జూన్ 22 : ంసిడెన్షియల్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్ళపల్లిలోని సిరిసిల్ల తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయంను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట హాస్టల్ లోని డైనింగ్ హాల్ కి వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా కలెక్టర్ వారితో మాట్లాడారు. ఈరోజు ఏ ఏ ఆహార పదార్థాలు వడ్డించారనీ ఆరా తీశారు. మెనూ చార్ట్ పరిశీలించిన కలెక్టర్. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గోదాంలో బియ్యం, పప్పులు ఇతర ఆహార పదార్థాలను నాణ్యతను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు వచ్చారో ఆరా తీశారు. అనంతరం వసతి గదులను, టాయిలెట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులందరూ తరగతులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. విద్యాలయాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.

# చిరుధాన్యాల సాగుకు రైతులు ముందుకు రావాలి

**- రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి**
**- ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 22 : రసాయన ఎరువుల అధిక వినియోగం ప్రజల ఆరోగ్యాలపై ప్రతికూల ప్రభావం చూపుతోందని, ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో రైతులు కీలక పాత్ర పోషించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.వరి సాగుకు ప్రత్యామ్నాయంగా కొర్రలు, సామలు, రాగులు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ప్రజలు కూడా చిరుధాన్యాలతో తయారయ్యే సాంప్రదాయ ఆహారాలను ఆహారపు అలవాట్లలో భాగం చేసుకోవాలని చెప్పారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ఆవు పేడ, ఆవు మూత్రం ఆధారంగా ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని రైతులకు పిలుపునిచ్చారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపూర్ లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతు సమావేశాలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, పంట మార్పిడి విధానాలు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి , బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూర్ అశోక్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర రెడ్డి, పీస్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ నిమ్మయ్య, దేవర శ్రీనివాసు, దాసరి మల్లేశం, పాశం భాస్కర్, కర్నాటి ధనుంజయ్, పి.ఎస్. రవీందర్, తుమ్మల మురళీధర్ రెడ్డి, మాయ దశరథ్, చందా మహేందర్, పట్నం శ్రీనివాస్, గూడూరు నరోత్తం రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, కోటేష్, వైజయంతి, కమత్కరి కృష్ణ, తడిసిన మల్లారెడ్డి, సర్వే శ్రీనివాస్ గౌడ్, సుచరిత, నరసింహ యాదవ్, రాములు యాదవ్, కాలభైరవ రాజు, చుక్కారెడ్డి, తానేష్ గౌడ్, మాణిక్యం రెడ్డి, కోళ్ల బిక్షపతి, రత్నపురం బలరామ్, చిర్క సురేష్ రెడ్డి, బొల్లు సుదర్శన్, కాశీనాథ్, పూజారి కుమార్, మేకల శీను, మేకల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనివ్వాలి

**కలెక్టర్ కోయ శ్రీహర్ష**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, జూన్ 22 : ప్రజావాణిలో అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి, డీఆర్వో రాజేశ్వరితో కలిసి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన నోముల రాజేశ్వర్ రెడ్డి ఇంటి ఆన్‌లైన్ నమోదు విషయంలో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేయగా, చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు. రామగుండం గౌతమినగర్‌కు చెందిన డి.కాశయ్య మల్యాపురం గ్రామంలోని ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు కేటాయించిన 20 ఎకరాల భూమిలో ప్రభుత్వ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని కోరగా, ఆర్డీవో పెద్దపల్లికి నివేదిక పంపించారు. ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన వేముల నర్సమ్మ తన భూమిని ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేయగా, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. గోదావరిఖని సూర్యనగర్‌కు చెందిన ఆర్.రాధ తన కుమారుడికి ప్రభుత్వ విద్యాసంస్థ హాస్టల్‌లో సీటు కల్పించాలని కోరగా, అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ అనేది ఎన్నికల సంఘం ముఖ్య విధి

**- కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు అసత్య ప్రచారం మానుకోవాలి**
**- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 22 : రాజ్యాంగం ప్రకారం ఎస్ఐఆర్ (సర్) అనేది ఎన్నికల సంఘం విధినిర్వహణలో ముఖ్య భాగమని, ప్రత్యేక సమగ్ర సవరణ అనే ప్రక్రియ ప్రజాస్వామ్యానికి ఆయువు పట్టు లాంటిదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ..ఇంతటి పవిత్ర కార్యక్రమాన్ని కుటుంబ పార్టీలు అయినటువంటి కాంగ్రెస్, ఎంఐఎం, బిఆర్ఎస్ పార్టీలు బిజెపి పార్టీ, ఎన్నికల సంఘం కలిసి ముస్లింల, క్రైస్తవుల, ఎస్సీ, ఎస్టీ, మహిళల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించడానికి ఎన్నికల్లో గెలుపు మార్గాల కోసం విష ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఒకవేళ అదే నిజమైతే ఒక్క కేసు ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఎందుకు నమోదు కాలేదని నమోదైన ఎందుకు కోర్టు ముందు నిలువలేకపోయిందని ప్రశ్నించారు. ఇన్ని రోజులు దొంగ ఓట్లతో బోగస్ ఓట్లతో గెలవడానికి ఉచితాల పేరిట అడ్డగోలుగా హామీలు ఇచ్చి బంగ్లాదేశ్, పాకిస్తాన్, మయన్మార్ లాంటి దేశాల నుండి వచ్చిన అక్రమ చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించి ఓటు బ్యాంకుగా మలుచుకున్నాయని అన్నారు. అక్రమ చొరబాటుదారులు, చనిపోయిన, చిరునామా మారిన వారి ఓట్లు మరియు డబుల్ త్రిబుల్ ఓట్ల తొలగింపు కార్యక్రమం ఎన్నికల సంఘం రాజ్యాంగ బద్ధంగా నిర్వహిస్తుంటే బిజెపి మద్దతుతోనే ఎన్నికల సంఘం ఓట్ల తొలగింపు కార్యక్రమం చేపట్టిందని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గత 12 సంవత్సరాల నుండి బిజెపి ప్రభుత్వం కేంద్రంలో ఉండగా అక్రమ చొరబాటుదారులు ఎలా వచ్చారని ప్రశ్నించడం సిగ్గుచేటని అన్నారు. అక్రమ చొరబాటుదారులు వచ్చింది 12 ఏళ్ల కాలం నుండి కాదని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాలలో కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు పాకిస్తాన్, బంగ్లాదేశ్,మయన్మార్ దేశాల నుండి వచ్చిన అక్రమ చొరబాటుదారులకు ఎర్ర తివాచి పరచి స్వాగతం పలకడం వల్లనే ఇలాంటి పరిస్థితి దాపురించిందని అన్నారు. సర్ అనేది భారత ఎన్నికల వ్యవస్థలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగమని ఇది కొత్తగా నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక తీసుకొచ్చిన విధానం కాదని స్పష్టం చేశారు. భారత ఎన్నికల సంఘం ఇప్పటివరకు 11 సార్లు సర్ ప్రక్రియను నిర్వహించిందని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కూడా ఎన్నికల సంఘం అనేకసార్లు సర్ నిర్వహించిందని గుర్తు చేశారు. మధ్యప్రదేశ్లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారిని ఉరితీయాలని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించడం రాజ్యాంగ ప్రతిపత్తి గల ఎన్నికల సంఘాన్ని అవమానించడమేనని అన్నారు. 135 సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి నామినేషన్ పత్రం పూర్తి చేయరాకపోవడం దురదృష్టకరమని అన్నారు. నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక సరిహద్దుల్లో భారత భూభాగం లోనికి చైనా చొచ్చుకు వచ్చిందని తప్పుడు ప్రచారం చేసి దేశ సార్వభౌమత్వాన్ని కించపరిచేలా మాట్లాడిన పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ ను ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి, మండల నాయకులు కాశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

**- అవినీతి, ఉద్దేశపూర్వక జాప్యాన్ని సహించేది లేదు**
**- కలెక్టర్ కోయ శ్రీహర్ష**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, జూన్ 22 : ప్రజావాణి దరఖాస్తులు, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రజలకు సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు జే.అరుణశ్రీ, కొప్పుల వెంకట్ రెడ్డితో కలిసి జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజావాణి, ఆర్టీఐ దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించి ప్రతి దరఖాస్తుదారునికి తప్పనిసరిగా సమాచారం అందించాలని సూచించారు. ఫీల్డ్ సిబ్బంది హాజరు, పనితీరుపై శాఖాధిపతులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ప్రభుత్వ సేవలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ ఫైళ్లను క్రమం తప్పకుండా సమీక్షించి ఉద్దేశపూర్వక జాప్యాలను నివారించాలని సూచించారు. కొంతమంది ఫీల్డ్ సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్న కలెక్టర్, అవినీతిని ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, హానరోరియం సిబ్బందికి వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, కార్యాలయ భవనాలు, ఆవరణలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. త్వరలో నిర్వహించనున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి సమీక్ష కోసం అన్ని శాఖలు వాస్తవాధారిత నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇంకా ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఇసుక దోపిడీ పై విచారణ చేపట్టాలి..

**- ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూన్ 22 : ములుగు జిల్లాలో ఇసుక దోపిడి పై విచారణ జరపాలని బిఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బడే నాగజ్యోతి మీడియా సమావేశం నిర్వహించారు.తాడ్వాయి మండలంలోని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనుల్లో భారీ అవినీతి జరిగిందన్న ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.మేడారం పనుల విషయంలో అధికార పార్టీ మంత్రుల మధ్య ఆధిపత్య పోరు నడిచిందని,ఒకరిపై ఒకరు బహిరంగ విమర్శలు చేసుకున్న ఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని అన్నారు.దొంగ సర్టిఫికెట్లతో రాజకీయాలు చేస్తూ,ప్రజలను మోసం చేస్తున్న నాయకులు నేడు నీతులు చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.ములుగు జిల్లాలో జరుగుతున్న ఇసుక దోపిడీ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని, వేల కోట్ల రూపాయల అక్రమ ఇసుక వ్యాపారం వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.కేటీఆర్ లాంటి నాయకుడిపై తప్పుడు ఆరోపణలు చేయించడం ద్వారా ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మేడారం పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ పట్టుబడిన వారు అధికార పార్టీకి చెందినవారే కాదా అని ప్రశ్నించారు.గిరిజనుల సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చి,కొందరు నాయకులు,వారి అనుచరులు మాత్రమే లబ్ధి పొందుతూ గిరిజన సంఘాల సభ్యులను మోసం చేస్తున్నారని విమర్శించారు.ప్రజల సంపదను దోచుకుంటూ,అవినీతికి పాల్పడుతున్న వారికే ప్రజల శాపనార్థాలు తగులుతాయని హెచ్చరించారు.ప్రభుత్వ వైఫల్యాలు,అవినీతి,అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు దేవుళ్లను,ఆధ్యాత్మిక అంశాలను రాజకీయాలకు వాడుకోవడం కాంగ్రెస్ నాయకులకు అలవాటుగా మారిందని ఆరోపించారు.జిల్లాలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న రూ.4,000 కోట్ల ఇసుక అక్రమ దోపిడీపై సీబీఐ విచారణకు ఆదేశించి నిజానిజాలు ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ములుగు మండల పార్టీ మాజీ అధ్యక్షులు సానికొమ్ము రమేష్ రెడ్డి,జిల్లా నాయకులు వేములపల్లి బిక్షపతి,మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్ రెడ్డి,మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అకుతోట చంద్రమౌళి,మున్సిపాలిటీ కౌన్సిలర్లు బైకని అనూష సాగర్, కోగిల లక్ష్మీ,సర్పంచులు తప్పెట్ల రాజేందర్,దాసరి సరిత రమేష్, మాజీ ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, మాజీ సర్పంచ్ రాజన్న,సీనియర్ నాయకులు కాకి పురుషోత్తం, ఉయ్యాల భద్రయ్య,వాంకుడోత్ రాందాస్,మెరుగు సంతోష్, కొమరం సిద్ధు,మహిళలు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలి

**- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**



(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల, జూన్ 22, : యువత ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే విధంగా పట్టుదలతో కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం జిల్లాలోని మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేసిన జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ యువత లక్ష్యాలను ఉంచుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాలలో ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో అభ్యర్థులు జర్మన్ భాషను ఇష్టంగా నేర్చుకోవాలని తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారు తమ తల్లిదండ్రులను సంతోషంగా చూసుకోవాలని, ఇతరులకు ఆదర్శంగా నిలిచి మరింత మందికి అవకాశాలు కల్పించేలా కృషి చేయాలని తెలిపారు. విదేశాలలో స్థానిక నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, పనిలో బాస్ మేనేజ్మెంట్ 70 శాతం ఉంటే పని 30 శాతం ఉంటుందని, అభ్యర్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, జర్మనీలో నైపుణ్యం కలిగిన యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జర్మనీలో వారానికి కేవలం 32 నుండి 35 గంటల పని సమయం మాత్రమే ఉంటుందని, మిగతా సమయంలో ఇతర నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. యువతలో క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధనపై దృష్టి ఉండాలని, జర్మన్ భాషను నేర్చుకోవడానికి ప్రతిరోజూ సాధన చేయాలని సూచించారు. జర్మనీలో ఉద్యోగం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో శిక్షణ పొందితే విజయం సాధిస్తారని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో అందిస్తున్న జర్మన్ భాషా శిక్షణను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. భాష శిక్షణను నిదానంగా,హౌహౌస్పష్టంగా నేర్చుకోవాలని శిక్షణ కాలం పూర్తి అయ్యేసరికి భాషపై పట్టు సాధించాలని, నైపుణ్యం సంపాదించాలని తెలిపారు. విదేశాలలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, శిక్షకులు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. యువత ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే విధంగా పట్టుదలతో కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం జిల్లాలోని మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేసిన జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ యువత లక్ష్యాలను ఉంచుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాలలో ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో అభ్యర్థులు జర్మన్ భాషను ఇష్టంగా నేర్చుకోవాలని తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారు తమ తల్లిదండ్రులను సంతోషంగా చూసుకోవాలని, ఇతరులకు ఆదర్శంగా నిలిచి మరింత మందికి అవకాశాలు కల్పించేలా కృషి చేయాలని తెలిపారు. విదేశాలలో స్థానిక నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, పనిలో బాస్ మేనేజ్మెంట్ 70 శాతం ఉంటే పని 30 శాతం ఉంటుందని, అభ్యర్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, జర్మనీలో నైపుణ్యం కలిగిన యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జర్మనీలో వారానికి కేవలం 32 నుండి 35 గంటల పని సమయం మాత్రమే ఉంటుందని, మిగతా సమయంలో ఇతర నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. యువతలో క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధనపై దృష్టి ఉండాలని, జర్మన్ భాషను నేర్చుకోవడానికి ప్రతిరోజూ సాధన చేయాలని సూచించారు. జర్మనీలో ఉద్యోగం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో శిక్షణ పొందితే విజయం సాధిస్తారని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో అందిస్తున్న జర్మన్ భాషా శిక్షణను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. భాష శిక్షణను నిదానంగా,హౌహౌస్పష్టంగా నేర్చుకోవాలని శిక్షణ కాలం పూర్తి అయ్యేసరికి భాషపై పట్టు సాధించాలని, నైపుణ్యం సంపాదించాలని తెలిపారు. విదేశాలలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, శిక్షకులు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# విద్యాలయాలలో విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

**- సోఫీనగర్ గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు**

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 22 : విద్యాలయాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యతను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించేందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి బి. వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం సోఫీనగర్లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన హాస్టల్ గదులు, వంటశాల, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, వసతుల విషయంలో రాజీపడకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. అనంతరం వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ముచ్చటించారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ రుచికరమైన, పౌష్టికాహారం అందుతున్నదా లేదా అని విద్యార్థులను అడిగి నిర్ధారించుకున్నారు. చదువులో ఏవైనా సందేహాలు ఉన్నా, సమస్యలు ఎదురైనా వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధి విషయంలో ఉపాధ్యాయులు, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో ప్రిన్సిపాల్ డానియల్, ఎం. ఈ. ఓ పద్మ, ఉపాధ్యాయులు కల్పన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# విధి నిర్వహణలోనే విషాదాంతం.. లారీ ఢీకొని డీటీవో వెంకన్న దుర్మరణం

**- 25 రోజుల క్రితమే భూపాలపల్లికి బదిలీ.. రవాణా శాఖలో విషాద ఛాయలు**

**- రవాణా శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సంతాపం.**

**- ఘటనపై సమగ్ర విచారణకు హరీష్ రావు డిమాండ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, జూన్ 22 : ప్రజల భద్రత కోసం విధులు నిర్వర్తిస్తున్న ఓ అధికారి, అదే విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం జయశంకర్–భూపాలపల్లి జిల్లాను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో) వెంకన్న సోమవారం ఉదయం గణపురం మండలం చెల్పూర్ శివారులోని ఆర్టీఓ కార్యాలయం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వివరాల ప్రకారం, వెంకన్న ఆర్టీఓ కార్యాలయం సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో వేగంగా వచ్చిన బొగ్గు లారీ ఆయనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రాణాలు నిలువలేదు. విధి నిర్వహణలో ఉండగానే ఆయన మృతి చెందడం అధికార వర్గాలను, ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా కేవలం 25 రోజుల క్రితమే జగిత్యాల జిల్లా నుంచి భూపాలపల్లి జిల్లాకు వచ్చిన వెంకన్న, తన కర్తవ్యనిష్ఠ, క్రమశిక్షణ, నిజాయితీతో గుర్తింపు పొందారు. అక్రమ రవాణా, నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించే అధికారిగా పేరు తెచ్చుకున్నారు. అలాంటి అధికారి విధి నిర్వహణలోనే మృతి చెందడం రవాణా శాఖలో విషాద ఛాయలు అలుముకునేలా చేసింది. వెంకన్న మృతివార్త తెలిసిన వెంటనే జిల్లా వ్యాప్తంగా సంతాప వాతావరణం నెలకొంది. సహచర అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల రోదనలు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కలచివేశాయి. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వెంకన్న ఆకస్మిక మరణంతో వారి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

**మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం**

డీటీవో వెంకన్న మృతి పట్ల రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉండగానే ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రహదారి భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో వెంకన్న చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేసిన మంత్రి, అంకితభావం కలిగిన అధికారిని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



**సమగ్ర దర్యాప్తుకు డిమాండ్:**

ఈ ఘటనపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు స్పందిస్తూ, "ఇసుక, బొగ్గు అక్రమ రవాణాను అడ్డుకుంటే అధికారులను చంపేస్తారా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం ప్రమాదమా, లేక మరేదైనా కోణం ఉందా అన్న అంశాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. లారీ వేగం, డ్రైవర్ నిర్లక్ష్యం, ఇతర అనుమానాస్పద అంశాలతో పాటు ప్రమాదానికి దారితీసిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది. విధి నిర్వహణలోనే ప్రాణాలు అర్పించిన వెంకన్న సేవలను జిల్లా ప్రజలు, సహచర అధికారులు, ఉద్యోగులు స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

# జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**- తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలదేవి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 22 : జిల్లాలో క్రీడల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలదేవి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా అటవీ అధికారి బాలమణి లతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో క్రీడారంగం తో పాటు మైదానాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ క్రీడా మైదానం కొరకు కేటాయించిన స్థలాన్ని మైదానం అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పన, కౌటాల మండల కేంద్రంలో గల మినీ స్టేడియం అభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా చేపట్టిన కార్యక్రమాలపై వివరించారు. అనంతరం క్రీడా శాఖ అధికారులతో కలిసి జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గల క్రీడా మైదానం, ఆదర్శ క్రీడా పాఠశాల మైదానాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు జిల్లా కలెక్టరేట్ కు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలదేవి కు జిల్లా కలెక్టర్ పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా యువజన సేవల శాఖ అధికారి అశ్వక్ అహ్మద్, క్రీడ శాఖ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, జూన్ 22 : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలు రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారం అందిస్తారని, సంబంధిత ఓటరు నింపి ఫారాలను తిరిగి బూత్ స్థాయి అధికారులు ఇంటికి వచ్చిన సమయంలో సేకరించి వారంలో పొందుపరిచిన వివరాలను యాప్లో నమోదు చేస్తారని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు సహాయకులుగా వాలంటీర్లను నియమించడం జరుగుతుందని, ఇందులో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సమైక్య సంఘ నిర్వాహకులు, యువజన సంఘాల ప్రతినిధులు, కుల పెద్దలు ఉంటారని తెలిపారు. తహసిల్దార్లు, సూపర్వైజర్లు, జిల్లా యంత్రాంగం సమగ్ర సవరణ ప్రక్రియను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని, తమ బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల, జూన్ 22, : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూరు పట్టడానికి చెందిన లింగ కృష్ణ తాను టైల్స్, మార్బుల్ వ్యాపారం నిర్వహిస్తున్నానని, అన్ లోడింగ్ సమయంలో హమాలీలు అధిక ధరలు చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన దోమల చంద్రశేఖర్ తన కూతురు మందమర్రి లోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఆరవ తరగతి పూర్తి చేసిందని, మంచిర్యాలలోని వసతి గృహానికి బదిలీ చేయగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నెన్నెల మండలం కోనంపేట గ్రామ రైతులు తమకు ముఖ్యమంత్రి గిరి వికాస్ పథకం కింద మంజూరైన బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని ఎన్ టి ఆర్ నగర్ కు చెందిన చిలుక పద్మ తాము ఉంటున్న రేకుల ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన మాగంటి సౌభాగ్యవతి తాను భూభారతి పోర్టల్ లో పాస్ పుస్తకం వివరాల సవరణ కొరకు దరఖాస్తు చేసుకున్నానని, దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం అమరవాది కు చెందిన తోటపల్లి లత తన భర్త మరణించినందున జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నానని, ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం గద్దెరాగడి ప్రాంతానికి చెందిన గొట్టే నరేందర్ బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లిలో అనుమతులకు మించి మట్టి తవ్వకాలు జరిగాయని, ఈ విషయమై పూర్తి విచారణ చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన సముద్రాల శంకర్ తమ గ్రామంలోని చెరువులపై జరిగిన అక్రమ ఆక్రమణలను తొలగించి చెరువులను పునరుద్ధరించాలని, శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, వైద్యాధికారులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ నెల 29, 30 తేదీలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 0–5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా 1 వేయి 836 సిబ్బంది 459 బూత్ ల ద్వారా పోలియో చుక్కల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పోలియో వ్యాక్సిన్ సురక్షితమైనదని, అనారోగ్యంగా ఉన్నవాళ్లు కూడా ఈ వ్యాక్సిన్ వేసుకోవచ్చని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా నీటి జనిత, కీటక జనిత వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని, అన్ని శాఖల సమయంతో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాను పోలియో రహిత, ఆరోగ్య మంచిర్యాల గా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

**- పట్టణ అభివృద్ధికి రోడ్డు వెడల్పు అత్యంత కీలకం**

**- ధాన్యం నిలువ చెసే గోడౌన్స్ ల కోరకు స్థల పరిశీలన**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెటిపేట, జూన్ 22 : లక్షెటిపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఆసుపత్రిలోని పరిస్థితులను అక్కడ చికిత్స పొందుతున్న రోగులను స్వయంగా పలకరించి వారి ఆరోగ్య పరిస్థితులను వారికీ అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమైన ఎమ్మెల్యే ఆసుపత్రిలో పరిశుభ్రత, రోగులకు మెరుగైన సేవలు అందించే విషయంలో పలు సూచనలు చేశారు. ఆసుపత్రి పవిత్రతను కాపాడే ఉద్దేశ్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు సహా ఎవరైన ఆసుపత్రి లోపలికి ప్రవేశించే సమయంలో చెప్పులు బయట విడిచి రావాలని వైద్యులకు సూచించారు. అనంతరం మున్సిపాలిటీలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులపై స్పందిస్తూ పట్టణ అభివృద్ధికి అత్యంత కీలకమైన రోడ్డు వెడల్పు పనులను ఎట్టి పరిస్థితుల్లోను ఆపేది లేదని, ఎన్ని అడ్డంకులు వచ్చిన అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం రైతులు పండించే ధాన్యం కోసం లక్షెట్టిపేట మున్సిపాలిటీ శివారులో గల గోడంల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్, తాసిల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి–నర్సయ్య, వైస్ చైర్మన్ మోత్కూరి రాజేశ్వరి–వెంకటస్వామి గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్ చంద్, వైస్ చైర్మన్ ఆరీఫ్, కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, జిల్లా ఆర్జీపిఆర్ఎస్ గడ్డం త్రిమూర్తి, జిల్లా నాయకులు చల్లా నాగభూషణం, పూర్ణచందర్ రావు, సర్పంచ్లు, కౌన్సిలర్లు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 22 : పజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణులతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. వాంకిడి మండలం వెల్గి గ్రామానికి చెందిన జుగునాక బాది రావు పేదవాడు అయిన తనకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ మండల కేంద్రానికి చెందిన జువెల్ల హుస్సేన్ తనకు స్వాతంత్ర సమరయోధుడి ధ్రువపత్రం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కౌటాల మండలం వీర్దండి గ్రామ మాజీ సర్పంచ్ తన దరఖాస్తులో తాను పదవీకాలంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు ఇప్పించాలని కోరారు. పెరిటాల మండలం మొగడ్ దగడ్ గ్రామానికి చెందిన ఎర్మ సుధాకర్ తనకు చెందిన ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా భూమిలో సోలార్ కనెక్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చింతల మానేపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన రౌతు విర్ధు తన పట్టా భూమి నుండి ఇతర వ్యక్తులు బలవంతంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లింగాపూర్ మండలం ఖీమనాయక్ తండాకు చెందిన తేజావత్ సంగీత తనకు ఆశ వర్కర్ పోస్ట ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెజ్జూరు మండలం సల్గుపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి లింగయ్య తాను తెలంగాణ ఉద్యమంలో పనిచేసినందున సంక్షేమ పథకంలో తనను గుర్తించి పథకాలు వర్తింపజేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం గోడవెల్లి గ్రామానికి చెందిన ఘాజిరెడ్డి కార్తీక్ తనకు దివ్యాంగుల పింఛను మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాలక్ష్యం

సంపాదకీయం

# ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన !

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. చినుకు పడడమే కష్టంగా మారింది. నైరుత ప్రవేశించినా చుక్కనీరు చిక్కలేదు. భూములు తడవలేదు. వ్యవసాయం పూర్తిగా పడకేసింది. నదులు నోరెళ్లబెట్టాయి. భూగర్భజలాలు అడుగంటాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సాగు ఎలా ఉన్నా తాగునీటికి తీవ్ర కటకట ఏర్పడేలా ఉంది. కృష్ణా, గోదావరి నదులు వట్టిపోయాయా అన్నట్లుగా మారాయి. ఈ పాటికి గోదావరిలో ఎగువ నుంచి నీరు వచ్చేది. దీంతో సాగు సాగేదెలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచు తున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపా ధితో ముడిపడి ఉండటంతో పంటల ఎంపికపై తీసుకునే నిర్ణయాలు విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎల్ని నో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతు న్నదని వాతావరణ శాఖ తెలియచేస్తోంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వన రుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. అయితే వాతావరణ పరిస్థితులు నిరంతరం మారుతుంటాయని, రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితిలో మెరుగుదల సంభవించే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ రైతాంగం ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మృగశిర కార్తెతో పాటు ఖరీఫ్ సీజన్‌పై ఆశలు పెట్టుకుంది. జూన్ తొలి వారం నుంచే నాగలి పట్టి, నారుమళ్లు పోసి, విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. అయితే సాధారణంగా కనిపించే నైరుతి వర్షపాత చురుకుదనం ఈసారి అనేక ప్రాంతాల్లో కనిపించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రం లో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభా వం చూపుతున్నది. వాతావరణ మార్పుల కారణంగా నైరుతి రుతుపవనాల పురోగతిపై ప్రభావం చూపుతున్నాయి. భారత వాతావరణ శాఖకు సంబంధించిన గణాంకాలను ఉటంకిస్తూ ప్రచురితమైన నివేదికల ప్రకారం, వ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తు న్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణ లోనూ వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్యమవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితు ల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంత మైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

## మాదక ద్రవ్యాల విషవలయం:

# యువశక్తికి పొంచివున్న సామాజిక సంక్షోభం

## తాత్కాలిక ఆనందం... జీవితాంతం విషాదం: యువతను మింగుతున్న డ్రగ్స్ భూతం



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) నేడు ప్రపంచ వ్యాప్తంగా మానవ సమాజాన్ని, ముఖ్యంగా ఆధునిక నాగరికతను వేధిస్తున్న అత్యంత ప్రమాదకరమైన సామాజిక సంక్షోభం. ఒకప్పుడు కేవలం సంపన్న వర్గాలకో, విలాసవంతమైన నగరాలకో లేదా అంతర్జాతీయ స్మగ్లర్ల రహస్య స్థావరాలకో పరిమితమైన ఈ వ్యసన సంస్కృతి, నేడు నిశ్శబ్దంగా గ్రామీణ ప్రాంతాలకు, చివరకు పల్లెల్లోని సామా న్య కుటుంబాలకు సైతం విస్తరించడం అత్యంత ఆందోళనకరం. దేశ ప్రగతికి, భవిష్యత్తుకు వెన్నెముక లాంటి యువశక్తిని ఈ మహమ్మారి నీరు గారుస్తోంది. పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు, హాస్టళ్లు, వినోద కేంద్రాల నుంచి మొదలు కొని వినూత్న సాంకేతిక విప్లవమైన సోషల్ మీడియా వేదికల వరకు ఈ విషవలయం విస్తరించింది. యువత మాదక ద్రవ్యాల బారిన పడటం అనేది కేవలం ఒక వ్యక్తిగత ఆరోగ్య సమస్య లేదా నైతిక పతనం మాత్రమే కాదు; అది ఒక కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నానికి, ఆర్థిక నష్టానికి, శాంతిభద్రతల క్షీణతకు మరియు దేశ జాతీయ భద్రతకే పెను సవాలుగా పరిణమించిన ఒక బహుముఖ సంక్షోభం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO), ఐక్యరాజ్య సమితి మాదక ద్రవ్యాలు, నేరాల నియంత్రణ సంస్థ (UNODC) విడుదల చేసిన అంతర్జాతీయ నివేదికలను పరిశీలిస్తే భయంకరమైన వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 30 కోట్లకు పైగా ప్రజలు వివిధ రకాల మాదక ద్రవ్యాలను వినియోగిస్తుండగా, అందులో సింహభాగం 15 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులే కావడం గమనార్హం. భారత దేశంలో కూడా గత దశాబ్ద కాలంలో డ్రగ్స్ వినియోగం ఊహించని రీతిలో, గణనీయమైన శాతంలో పెరిగింది. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ నిర్వహించిన జాతీయ స్థాయి సర్వేల ప్రకారం, దేశంలో లక్షలాది మంది యువత సంప్రదాయ గంజాయి, అఫిములతో పాటు హెరా యిన్, కొకైన్ వంటి ప్రాణాంతక డ్రగ్స్ మరియు ఎల్ఎస్‌డీ (LSD), ఎండీఎంఏ, మెథాంఫెటమైన్ వంటి సింథటిక్, రసాయన పదార్థాలకు తీవ్రంగా బానిసలవుతున్నారు. ముఖ్యంగా దేశ ఆర్థిక రాజధాని ముంబై, జాతీయ రాజధాని ఢిల్లీతో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ఐటీ హబ్‌లు, పంజాబ్, మణిపూర్ వంటి సరిహద్దు రాష్ట్రాలు ఈ డ్రగ్స్ మాఫియాకు ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయి.

యువత ఇంతలా ఈ వ్యసనాల వైపు ఆకర్షితులు కావడానికి వెనుక అనేక సామాజిక, మానసిక, సాంస్కృతిక కారణాలు దాగి ఉన్నాయి. ఆధునిక విద్యా వ్యవస్థలో విపరీతంగా పెరిగిపోయిన పోటీ, మార్కుల కోసం తల్లిదండ్రుల ఒత్తిడి, పరీక్షల భయం, ఉన్నత ఉద్యోగాల సాధనలో ఎదురవుతున్న వైఫల్యాలు యువతలో తీవ్ర మానసిక ఆందోళనకు దారితీస్తున్నాయి. ఈ ఒత్తిడి నుంచి తాత్కాలిక ఉపశమనం కోసం, మానసిక ఒంటరితనాన్ని మరిచి పోవడం కోసం కొందరు ఈ తప్పుడు మార్గాన్ని ఎంచుకుంటున్నారు. దీనికి తోడు 'పీర్ ప్రెషర్' అనబడే స్నేహితుల ఒత్తిడి, సమ వయస్కుల మధ్య తాము తక్కువ అయిపోకూడదనే అహంకారం కూడా ఒక ముఖ్య కారణం. వీటన్నింటికీ మించి, ఆధునిక సమాజంలో వినోద మాధ్యమాల ప్రభావం విపరీతం గా పెరిగింది. చలనచిత్రాలు, పాశ్చాత్య వెబ్ సిరీస్‌లు, సామాజిక మాధ్యమాలలో డ్రగ్స్ తీసుకోవడాన్ని ఒక 'ఫ్యాషన్' గా, ఆధునికతకు ప్రతీకగా, గొప్ప సాహసంగా ఆకర్షణీయంగా చూపించడం వల్ల పసి మనస్సులు తప్పుదోవ పడుతున్నాయి. ప్రారంభంలో కేవలం కుతూ హలంతోనో లేదా స్నేహితుల ముందు గొప్పలు చెప్పుకోవ డానికో ఒకసారి ప్రయత్నించే సరదా, క్రమంగా మెదడును తన ఆధీనంలోకి తెచ్చుకొని జీవితాంతం వదిలించుకోలేని భయంకరమైన వ్యసనంగా మారిపోతోంది.

మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు మొదటగా వ్యక్తిగత ఆరోగ్యాన్ని పూర్తిగా ఛిన్నాభిన్నం చేస్తాయి. డ్రగ్స్ శరీరంలోకి ప్రవేశించగానే కేంద్ర నరాల వ్యవస్థపై, ముఖ్యంగా మెదడు పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దీనివల్ల జ్ఞాపకశక్తి మందగించడం, ఆలోచనా సామర్థ్యం హరించుకుపోవడం, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం వంటి నష్టాలు వాటిల్లుతాయి. కాలక్రమేణా ఇది తీవ్రమైన మానసిక అస్థిరతకు, లేనివి ఉన్నట్లు ఊహించుకునే భ్రాంతులకు (Hallucinations), ఆందోళన (Anxiety), తీవ్ర నిరాశ (Depression) కు దారితీసి, చివరకు ఆత్మహత్యా ఆలోచనలను రేకెత్తిస్తుంది. శారీరకంగా గుండె, కాలేయం (లివర్), ఊపిరితిత్తులు, మూత్రపిండాలు వంటి ముఖ్య అవయవాలు క్రమంగా క్షీణిస్తాయి. మోతాదు మించి తీసుకోవడం (ాజవతీ ౬శీంవ) వల్ల శ్వాస వ్యవస్థ స్తంభించి ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది నడివయస్సులోనే ఆకస్మిక మరణాల బారిన పడుతున్నారు.

విద్యా వ్యవస్థపై మరియు విద్యార్థులపై ఈ ప్రభావం మరింత వినాశకరంగా ఉంటోంది. డ్రగ్స్‌కు బానిసైన విద్యార్థి చదువుపై ఏకాగ్రతను పూర్తిగా కోల్పోతాడు. తరగతులకు హాజరు కాకపోవడం, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోవడం, చివరకు చదువును మధ్యలోనే విడిచిపెట్టడం (Dropouts) వంటి పరిణామాలు సంభవి స్తాయి. ప్రవర్తనలో విపరీతమైన మార్పులు వచ్చి, హింసాత్మకంగా మారడం, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరుగు తుంది. విద్యాసంస్థల్లో ఇటీవల కాలంలో తరచూ బయటపడుతున్న డ్రగ్స్ ముఠాల ఉదంతాలు, విద్యా రంగాన్ని ఈ మహమ్మారి ఎంతలా కబ్జా చేసిందో స్పష్టం చేస్తున్నాయి.

వ్యక్తిగత వినాశనంతో ఆగని ఈ వ్యసనం, ఆ వ్యక్తి ఉన్న కుటుంబ వ్యవస్థను కూడా అగాధంలోకి నెట్టేస్తుంది. డ్రగ్స్ కొనుగోలు చేయడానికి భారీగా డబ్బు అవసరం కావడంతో, విద్యార్థులు లేదా యువకులు ఇంట్లో డబ్బు దొంగిలించడం, అబద్ధాలు చెప్పడం మొదలు పెడతారు. అది చాలనప్పుడు బయట మోసాలకు, చిన్న చిన్న నేరాలకు పాల్పడతారు. దీనివల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితి దిగజారడమే కాకుండా, సమాజంలో తల్లిదండ్రులు తలదించు కోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. తమ బిడ్డ భవిష్యత్తు నాశనమ వడాన్ని చూస్తూ ఆ తల్లిదండ్రులు అనుభవించే మానసిక వేదన వర్ణనాతీతం. ఒక వ్యక్తి వ్యసనపరుడైతే, ఆ వ్యసనం వెనుక ఒక మొత్తం కుటుంబం నిలువునా దహనమైపోతుందనేది కఠినమైన సాస్త్రీయ సత్యం.

అంతేకాకుండా, ఈ మాదక ద్రవ్యాల వ్యాపారానికి, నేర ప్రపంచానికి అవినాభావ సంబంధం ఉంది. ఇది అంతర్జాతీయ మాఫియా ముఠాలకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. భౌగోళికంగా భారతదేశం అక్రమ రవాణాకు అత్యంత అనుకూలమైన, ప్రమాదకరమైన ప్రాంతంలో ఉంది. పశ్చిమాన ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ లతో కూడిన "గోల్డెన్ క్రెసెంట్" (బంగారు నెలవంక) ప్రాంతం, తూర్పున మయన్మార్, థాయిలాండ్, లావోస్ లతో కూడిన "గోల్డెన్ ట్రయాంగిల్" (బంగారు త్రిభుజం) ప్రాంతాల మధ్య భారత్ విస్తరించి ఉండటం వల్ల, అంతర్జాతీయ స్మగ్లర్లు దేశ సరిహద్దులను సులభంగా వాడుకుంటున్నారు. సరిహద్దుల గుండా దేశంలోకి ప్రవేశించే ఈ విషపదార్థాలు దేశీయ నెట్‌వర్క్ ద్వారా నగరాలు, విద్యాసంస్థలకు చేరుతున్నాయి. ఈ అక్రమ వ్యాపారం ద్వారా ఆర్జించే నల్లధనాన్ని ఉగ్రవాద కార్యకలాపాలకు, దేశ విచ్ఛిన్నకర శక్తులకు (Narco-Terrorism) నిధులుగా మళ్లిస్తున్నట్లు జాతీయ భద్రతా సంస్థలు ఆధారా లతో సహా హెచ్చరిస్తున్నాయి.

ఇటీవలి కాలంలో హైదరాబాద్ టాలీవుడ్ డ్రగ్స్ కేసుల నుంచి ముంబై క్రూయిజ్ షిప్ ఉదంతాల వరకు, బెంగళూరు రేవ్ పార్టీల దాకా ఎన్నో సంఘటనలు చట్ట అమలు సంస్థలచే వెలుగులోకి తెచ్చబడ్డాయి. నేడు స్మగ్లర్లు సాంప్రదాయ పద్ధతులను పక్కనబెట్టి, పోలీసులకు దొరకకుండా ఉండేందుకు 'డార్క్ వెబ్' (Dark Web), ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌లు మరియు క్రిప్టోకరెన్సీలను వాడుతూ సాంకేతికతను దుర్వినియోగం చేస్తున్నారు. ఇది పోలీసు, నార్కోటిక్స్ విభాగాలకు సరికొత్త సవాళ్లను విసురుతోంది.



ఈ మహమ్మారిని అణచివేయడానికి భారతదేశంలో అత్యంత కఠినమైన చట్టాలు అమలులో ఉన్నాయి. 1985 లో తీసుకువచ్చిన 'ఎన్‌డీపీఎస్ చట్టం' (Narcotic Drugs and Psychotropic Substances Act) ప్రకారం డ్రగ్స్ తయారీ, రవాణా, అమ్మకం లేదా వినియోగానికి పాల్పడితే భారీ జరిమానాలతో పాటు జీవిత ఖైదు, కొన్ని అరుదైన సందర్భాలలో మరణశిక్ష విధించే అవకాశం కూడా ఉంది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (NCB), రాష్ట్రాల ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కస్టమ్స్ విభాగాలు నిరంతరం దాడులు చేస్తూ కోట్లాది రూపాయల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంటున్నాయి. అయినప్పటికీ, కేవలం చట్టాలు, పోలీసుల లాఠీలతో మాత్రమే ఈ సామాజిక రుగ్మతను పూర్తిగా నిర్మూలించలేము. దీనికి సమగ్రమైన సామాజిక మార్పు, సమిష్టి బాధ్యత అత్యంత అవసరం.

ఈ పోరాటంలో ప్రథమ రక్షణ కవచం తల్లిదండ్రులే. వారు తమ పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపాలి. పిల్లల ప్రవర్తనలో వచ్చే ఆకస్మిక మార్పులను (ఒంటరిగా ఉండటం, ఆకలి మందగించడం, ఎక్కువ డబ్బులు అడగడం, విపరీతమైన కోపం) నిశితంగా గమనించాలి. వారితో స్నేహపూర్వకంగా ఉంటూ, వారి మానసిక ఒత్తిడిని పంచుకోవాలి. వారి స్నేహితులెవరు, వారి ఆన్‌లైన్ వ్యాపకాలు ఏమిటనే దానిపై నిరంతర నిఘా ఉంచాలి. అలాగే విద్యాసంస్థల పాత్ర కూడా తక్కువేమీ కాదు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు క్రమబద్ధమైన కౌన్సెలింగ్ అందించాలి. కళాశాలల్లో డ్రగ్స్ రహిత కమిటీలను ఏర్పాటు చేసి విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలి. యువత తమ అపారమైన శక్తిని, సృజనాత్మకతను తప్పుడు మార్గాల్లో కాకుండా క్రీడలు, యోగా, ధ్యానం, సంగీతం, సాహిత్యం వంటి ఉత్పాదక రంగాల వైపు మళ్లించేలా ప్రోత్సహించాలి.

యువత తాత్కాలిక భ్రాంతిని కలిగించే సుఖాల కోసం తమ అమూల్యమైన జీవితాలను, దేశ భవిష్యత్తును పణంగా పెట్టకూడదు. సమస్యలు ఎదురైనప్పుడు పారిపోకుండా, వ్యసనాల బారిన పడకుండా, ధైర్యంగా నిలబడి కుటుంబ సభ్యుల లేదా మానసిక నిపుణుల సహాయం తీసుకోవాలి. యువత దేశానికి శాశ్వత సంపద. వారి మేధస్సు, శ్రమ దేశ పురోగతికి ఇంధనం. అటువంటి యువశక్తిని మాదక ద్రవ్యాలనే భూతం మింగేయకుండా కాపాడు కోవడం కేవలం ప్రభుత్వానిదే కాదు; ప్రతి తల్లిదండ్రి, ఉపాధ్యా యుడు, సామాజిక సంస్థ, ప్రసార మాధ్యమాలు మరియు బాధ్యతా యుత పౌరుడి ప్రథమ కర్తవ్యం. సమాజమంతా సమిష్టిగా కదిలి, కఠిన చట్టాల అమలుతో పాటు మానవీయ కోణంలో అవగాహన కల్పించినప్పుడే మనం 'డ్రగ్స్ రహిత సమాజాన్ని' నిర్మించగలం. యువతను రక్షించుకోవడం అంటే మన దేశ అస్థిత్వాన్ని, భవిష్య త్తును రక్షించుకోవడమే.

-వ్యాసకర్త సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.

# తెలంగాణ ప్రజలకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

### - కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం - రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 22 : తెలంగాణ రాష్ట్రానికి, ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. బీఆర్ఎస్‌లో వర్గాలు, ముఠాలకు ఎలాంటి స్థానం లేదని, అందరూ కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా కింద ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా వైరా పట్టణంలోని కమ్మవారి కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఎస్ఆర్)పై బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, ఇతర పార్టీల్లో మాదిరిగా బీఆర్ఎస్‌లో వర్గపోరాటాలకు తావు లేదన్నారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గనిర్దేశంలో నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల పనితీరును కేసీఆర్, కేటీఆర్ ఎప్పటికప్పుడు గమనిస్తుంటారని తెలిపారు. ఎవరు పార్టీ కోసం ఎంత కష్టపడుతున్నారో వారికి పూర్తిగా తెలుసని, సిఫార్సులు లేదా పైరవీలకు కాకుండా అంకితభావంతో పనిచేసే వారికి పార్టీ తగిన గుర్తింపు, అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని పాలన సాగిస్తోందని, బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై విమర్శలు గుప్పించిన ఆయన, రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ విశేష విజయాన్ని సాధించి రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు, పదవులు లభిస్తాయని అన్నారు. అలాగే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో 18 ఏళ్లు నిండిన ప్రతి యువకుడి ఓటు నమోదు చేయించాలని, ఇప్పటికే ఉన్న ఓట్లు తొలగిపోకుండా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గుండాల కృష్ణ, బొమ్మెర రామూర్తి, గిరిబాబు, కృష్ణార్జున్, మనీషా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా కేసీఆర్ నాయకత్వానికి మద్దతుగా, బీఆర్ఎస్‌కు అనుకూలంగా కార్యకర్తలు నినాదాలతో సభా ప్రాంగణాన్ని మార్మోగించారు.

# ఈ నెల 25న షాబాద్ గిరిజన తాండాలో సేవాలాల్

### - మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూన్ 22 : మెదక్ జిల్లా,టేక్మాల్ మండల పరిధిలోని షాబాద్ గిరిజన తాండాలో ఈనెల 25 నుండి27 వరకు గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు షాబాద్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రభు, లునావత్ పవన్ నాయక్,రమావత్ సర్దార్ నాయక్ లు ఆదివారం రోజు ఓక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25న (గురువారం) ఉదయం గణపతి పూజ,పుణ్యాహ వచనం, గురు ప్రార్థన,అఖండ దీపారాధన,తదితర కార్యక్రమాలు, 26న (శుక్రవారం) మండప పూజలు,అన్నదివాసం, కనక దివాసం,పుష్ప దివాసం,మూల మంత్ర హోమం, మండప దేవత హోమం,తదితర కార్యక్రమాలు 27న (శనివారం) మండప పూజలు, దుర్గాభవాని,సేవాలాల్ పంచామృతం, మహాభిషేకం, యంత్ర ప్రతిష్ఠ,విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, సాయంత్రం 04.00గం.కు బోనాలు సమర్పణ ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమానికి ఆయా గిరిజన తాండాలోనీ సేవాలాల్ భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# "బొగ్గు చోరీ కథనాల్లో వాస్తవం లేదు"



### - డిజిటల్ నిఘాతో ప్రతి టన్ను బొగ్గు కదలికపై పర్యవేక్షణ
### - సింగరేణి డైరెక్టర్ ఎల్.వి. సూర్యనారాయణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, జూన్ 22 : సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షించబడుతుండటంతో బొగ్గు చోరీకి ఎలాంటి అవకాశం లేదని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ స్పష్టం చేశారు. ఇటీవల కొన్ని మీడియా సంస్థల్లో ప్రచురితమైన బొగ్గు చోరీ కథనాల్లో వాస్తవం లేదని ఆయన పేర్కొన్నారు. సోమవారం మణుగూరు ఏరియా జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సంస్థలో మొత్తం బొగ్గు రవాణాలో 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా జరుగుతోందని తెలిపారు. బొగ్గు కేటాయింపులు ఎస్.ఏ.పి. ఆధారిత డిజిటల్ వ్యవస్థ ద్వారా నిర్వహించబడుతుండగా, ప్రతి టన్ను బొగ్గు కదలికను కోల్ నెట్, ఎస్.ఏ.పి. తదితర ఆన్‌లైన్ వ్యవస్థల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. రోడ్డు మార్గంలో వెళ్లే ప్రతి బొగ్గు లారీ ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్‌ల వద్ద ఖచ్చితంగా తూకం వేయబడుతుందని, ఆర్.ఎఫ్.ఈ.డి. ఆధారిత బూమ్ బ్యారియర్లు, జీపీఎస్/జీపీఆర్ఎస్ ట్రాకింగ్ వ్యవస్థలు, జియోఫెన్సింగ్ సాంకేతికతల ద్వారా వాహనాల కదలికలను రియల్‌టైమ్‌లో పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. హోలోగ్రామ్ చలానాలు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ నిఘా ద్వారా రవాణా ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగుతోందన్నారు. అంతకుముందు డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ మణుగూరు ఏరియాలోని కేసిహెచ్పి , పికేఓసి-2 గనులను సందర్శించి బొగ్గు ఉత్పత్తి, రవాణా కార్యకలాపాలను పరిశీలించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 96.26 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు, సూపర్వైజర్లు, కార్మికులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించాలని, వర్షాకాలంలో ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మీడియా సమావేశంలో పికేఓసి-2 డిప్ ప్రాజెక్టు వేలం ప్రక్రియ పూర్తైందని, ఈ ప్రాజెక్టు సింగరేణికే దక్కుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా మణుగూరు ప్రాంతంలో మరో 15 నుంచి 20 సంవత్సరాల పాటు బొగ్గు ఉత్పత్తి కొనసాగించే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే మణుగూరు ఓసీ ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ, మణుగూరు ఏరియాలోని గనులు, సీహెచ్‌పీలు, రైల్వే సైడింగ్‌లు, వెయిబ్రిడ్జ్‌లు, స్టాక్ యార్డులు, ప్రవేశ-నిష్క్రమణ కేంద్రాల వద్ద అత్యాధునిక సీసీటీవీ నిఘా వ్యవస్థలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సింగరేణి సెక్యూరిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, భద్రతా సిబ్బంది 24 గంటలూ గస్తీ నిర్వహిస్తూ ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారని, బొగ్గు చోరీకి ఎలాంటి అవకాశం లేదని స్పష్టం చేశారు.



# సర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

### - ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, జూన్ 22: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బూత్ లెవెల్ ఏజెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండి ప్రజలకు సరైన సమాచారం అందించాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలోని సాయిరాం గార్డెన్‌లో సోమవారం బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన అవగాహన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఓటర్ల జాబితాలోని తప్పులను సరిదిద్దడంతో పాటు అర్హుల పేర్లు తొలగింపునకు గురికాకుండా చూడాలని సూచించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఖచ్చితమైన ఓటర్ల జాబితా అత్యంత కీలకమని పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను బీఎల్‌వోలు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు కర్ర శ్రీనివాస్ రెడ్డి (తిమ్మాపూర్), ఇప్ప నరేందర్ (గన్నేరువరం), సురేష్ (ఇల్లంతకుంట), శ్రీకాంత్ (బెజ్జంకి), విజయ్‌కుమార్ (మానకొండూరు), కొత్తపల్లి సర్పంచ్ గోదారి శోభారాణి, పలువురు ఆర్ఐలు పాల్గొన్నారు.

# పోరాట స్ఫూర్తిని రగిలించిన ఎఐటీయూసీ ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులు

### - లేబర్ కోడ్స్ నుంచి వర్గపోరాటాల వరకు కార్మిక చైతన్యాన్ని జ్వలింపజేసిన శిక్షణ కార్యక్రమం - కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయడమే కర్తవ్యం - ఎమ్మెల్యే కూనంనేని



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 22 : సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సింగరేణి కొత్తగూడెం ఏరియా గౌతంపూర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిశాయి. కార్యవర్గ సభ్యులు, పిట్ కార్యదర్శులు, ఆఫీస్ బేరర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్మిక ఉద్యమంపై అవగాహన పెంపొందించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. షబీర్ పాషా తదితరులు హాజరై కార్మిక ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లు, ట్రేడ్ యూనియన్ల బాధ్యతలు, కార్మిక హక్కుల పరిరక్షణపై మార్గనిర్దేశం చేశారు. శిక్షణ తరగతుల్లో రాష్ట్ర ఎఐటీయూసీ నాయకుడు సింగు నర్సింహారావు "చారిత్రక భౌతికవాదం" అంశంపై సమగ్ర వివరణ అందించగా, వి. మల్లికార్జునరావు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్స్‌పై అవగాహన కల్పించారు. కొత్త కార్మిక చట్టాల ప్రభావం, కార్మిక హక్కులపై వాటి ప్రభావాన్ని ఆయన వివరించారు. మధ్యాహ్నం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో కమ్యూనిస్టుల పాత్ర మరింత కీలకంగా మారిందన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయడం, కార్మిక వర్గ హక్కుల కోసం ఐక్య పోరాటాలు నిర్వహించడం కాలానుగుణ అవసరమని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. షబీర్ పాషా "కులం--వర్గం--వర్గపోరాటాలు--సామాజిక న్యాయం" అంశంపై ప్రసంగిస్తూ, సామాజిక న్యాయం సాధనలో వామపక్ష ఉద్యమాల చారిత్రక పాత్రను వివరించారు. వర్గ అసమానతలను తొలగించడంలో కార్మిక ఉద్యమాల ప్రాధాన్యతను ఆయన నొక్కి చెప్పారు. ఎఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, వేతనాలు, సంక్షేమ సౌకర్యాలు, కార్మిక చట్టాల అమలు వంటి అంశాలపై కార్మిక వర్గం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడం, అవసరమైతే పోరాటాలకు సిద్ధం కావడం ట్రేడ్ యూనియన్ల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నాయకులు నాయకులు మాట్లాడుతూ, కార్మికులకు రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, సత్తుపల్లి కార్యదర్శి సముద్రాల సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శులు గట్టయ్య, సూర్యప్రకాశ్, ఆఫీస్ బేరర్లు సందబోయిన శ్రీనివాస్, ఎస్. నాగేశ్వరరావు, హుమాయూన్, హీరాలాల్, గుమ్మడి వీరయ్య, పిట్ కార్యదర్శులు భూక్యా రమేష్, ఎం.ఆర్.కే. ప్రసాద్, మధుకృష్ణ, కమల్, కిషోర్, చారి, భీమయ్య, అప్పారావు, బండారి మల్లయ్య, మండల రాజేశ్వరరావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# "డీటీవో ప్రమాదంలో పాల్గొన్న లారీ సింగరేణిదికాదు"

### - సోషల్ మీడియా ప్రచారాన్ని ఖండించిన సింగరేణి యాజమాన్యం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, జూన్ 22 : భూపాలపల్లిలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా రవాణా అధికారి (డీటీవో) వెంకన్న మృతి చెందిన ఘటనకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్)కు ఎలాంటి సంబంధం లేదని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ ప్రమాదాన్ని సింగరేణి కార్యకలాపాలతో ముడిపెడుతూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, నిరాధార ఆరోపణలతో కూడిన ఫేక్ న్యూస్ మాత్రమేనని పేర్కొంది. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రమాదానికి కారణమైన లారీ సింగరేణి సంస్థకు చెందినది కాదని వివరించింది. ప్రమాదానికి గురైన లారీ రిజిస్ట్రేషన్ నంబర్ టీఎస్22బి 2687 కాగా, అది తాడిచెర్ల ప్రాంతం నుంచి చెల్పూర్‌లోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ-జెన్‌కో)కు బొగ్గు రవాణా చేస్తోందని తెలిపింది. ఆ వాహనానికి సింగరేణి సంస్థ కార్యకలాపాలు, సిబ్బంది లేదా రవాణా వ్యవస్థతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. సింగరేణి సంస్థ ఎల్లప్పుడూ అత్యున్నత భద్రతా ప్రమాణాలు, నిబంధనలను పాటిస్తూ కార్యకలాపాలు నిర్వహిస్తోందని యాజమాన్యం పేర్కొంది. ఇటువంటి విషాదకర సంఘటనను సింగరేణితో అనుసంధానిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం ఖండనీయమని తెలిపింది. ప్రజలు, మీడియా ప్రతినిధులు ధృవీకరించబడిన సమాచారాన్నే విశ్వసించాలని, సోషల్ మీడియాలో ప్రసారమవుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

# సింగరేణి ఉద్యోగులకు భారీ బీమా భరోసా




### - సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎస్సీసీఎల్ ప్రత్యేక ఒప్పందం
### - ప్రమాద మరణానికి రూ.1.5 కోట్ల వరకు, సహజ మరణానికి రూ.20 లక్షల వరకు బీమా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 22 : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్) ఉద్యోగుల సంక్షేమానికి మరొక కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులకు మెరుగైన ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ప్రత్యేక బీమా, బ్యాంకింగ్ సేవల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జీతభత్యాల ఖాతాలు కలిగిన సింగరేణి ఉద్యోగులకు ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యం సంభవించిన సందర్భంలో రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు బీమా రక్షణ లభించనుంది. అలాగే సహజ మరణం సంభవించినప్పుడు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బీమా ప్రయోజనం అందనుంది. ఇవే కాకుండా ఉద్యోగులకు పలు ప్రత్యేక బ్యాంకింగ్ సౌకర్యాలు, రాయితీలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మరింత ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా సంస్థ ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు మార్గదర్శకత్వంలో, ఎస్సీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి (ఐఏఎస్), డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోత్రు (ఐఏఎస్) ప్రత్యేక చొరవతో ఈ ఒప్పందం అమలులోకి వచ్చింది. కొత్తగూడెంలోని ఎస్సీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఎస్సీసీఎల్ తరఫున జనరల్ మేనేజర్ (పర్సనల్--వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్) జి.వి. కిరణ్ కుమార్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోన్ తరఫున డిప్యూటీ జోనల్ హెడ్ ఎ.వి. రమణమూర్తి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పర్సనల్-ఐఆర్ అండ్ పీఎం విభాగానికి చెందిన కవితా నాయుడు, జీఎం (పర్సనల్ ఈఈ అండ్ ఆర్సీ) ఎ.జె.ఎం. మురళీధర్ రావు, జీఎం (ఎఫ్ అండ్ ఏ) ఎన్. చక్రవర్తి, డీజీఎంలు కేస నారాయణరావు, ముకుంద సత్యనారాయణతో పాటు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఒప్పందం సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ కట్టుబాటును మరోసారి చాటిచెప్పిందని అధికారులు పేర్కొన్నారు.



# పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా విత్తన బంతుల తయారీ

### - అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఐఎస్‌జీఎఫ్ ప్రత్యేక కార్యక్రమాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 22 : పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం విస్తరణ లక్ష్యంగా ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ (ఐఎస్‌జీఎఫ్) భద్రాద్రి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విత్తన బంతుల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే సందర్భంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా సాధన కార్య క్రమాలు చేపట్టి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. చుంచుపల్లి మండలంలోని ఎల్ఐసీ కార్యాలయం వెనుక గల ఐఎస్‌జీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్కే జరీనాబీ నివాసంలో ఆమె సారథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వివిధ రకాల విత్తనాలతో సీడ్ బాల్స్ తయారు చేసిన సభ్యులు, రానున్న వర్షాకాలంలో కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతాలు మరియు మొక్కల సాంద్రత తక్కువగా ఉన్న ప్రదేశాల్లో వాటిని వెదజల్లేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ విధానంతో విత్తనాలు సహజసిద్ధంగా మొలకెత్తి మొక్కలుగా, అనంతరం వృక్షాలుగా ఎదిగే అవకాశాలు అధికంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలని, భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతిని అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సభ్యులు యోగా ఆసనాలు ప్రదర్శించి, నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌జీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ ఖాసిం, జిల్లా కోఆర్డినేటర్ జ్యోతి రాణి, జిల్లా కోశాధికారి సమ్మయ్య, జాయింట్ సెక్రటరీ కళ్యాణి, ఉమెన్స్ గిల్డ్ జిల్లా కోశాధికారి సోనా, జిల్లా బాధ్యులు నసీం పాషా, శనగ రాంచందర్‌రావు, ఖాదర్ మొహినుద్దీన్, చుంచు అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ డ్యూటీ మీట్‌తో సామర్థ్యం పెరుగుతుంది

### రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), జూన్ 22 : రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించారు. డీజీపీ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బందికి కమిషనరేట్ స్థాయి మూడవ పోలీస్ డ్యూటీ మీట్--2026 కార్యక్రమాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పెద్దపల్లి,మంచిర్యాల జోన్‌లకు చెందిన అధికారులు, సిబ్బందికి కంప్యూటర్,ఫోరెన్సిక్ సైన్స్,ఫింగర్ ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, పేలుడు పదార్థాల గుర్తింపు, యాంటీ-సబోటేజ్ తనిఖీలు,కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని, అనంతరం జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే అవకాశమూ ఉంటుందని తెలిపారు. శాస్త్రీయ దర్యాప్తు,వేలిముద్రల విశ్లేషణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి,కేసుల దర్యాప్తులో మెళకువలను నేర్చుకోవడానికి, పోలీసు నైపుణ్యాలను ప్రదర్శించడానికి, సంక్లిష్టమైన కేసుల పరిష్కారానికి అవసరమైన ఆలోచనలను పరస్పరం పంచుకోవడానికి, వృత్తిపరమైన పనితీరు, సామర్థ్యాలను మెరుగుపరచుకోవడానికి పోలీస్ డ్యూటీ మీట్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి జోన్,రాష్ట్ర,జాతీయ స్థాయిల్లో జరిగే పోలీస్ డ్యూటీ మీట్‌లలో పాల్గొనే అవకాశం లభిస్తుందని,వివిధ ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య పరస్పర సహకారం, ప్రోత్సాహం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే వారందరూ తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాలని, ఇక్కడ ఎంపికై కాళేశ్వరం జోన్ తరఫున,రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి రామగుండం కమిషనరేట్‌కు, కాళేశ్వరం జోన్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్,అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేందర్,ఏఓ శ్రీనివాస్,ఇన్స్ పెక్టర్లు, ఆర్ఐలు, సీఐలు,ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణం పోతున్నా దారి ఇవ్వలేదు..!

### - మణుగూరు ట్రాఫిక్‌లో బలైన నిండు ప్రాణం
### - ఇసుక లారీలతో స్తంభించిన ప్రధాన రహదారి-అంబులెన్స్‌కూ దారి లేక నరకయాతన.
### - ట్రాఫిక్ మధ్యే ప్రాణాలు కోల్పోయిన యువకుడు.. ప్రజల్లో ఆగ్రహం.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మణుగూరు, జూన్ 22 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని మణుగూరులో సోమవారం చోటుచేసుకున్న విషాద ఘటన స్థానికులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఇసుక లారీలతో ప్రధాన రహదారి పూర్తిగా ట్రాఫిక్ జామ్ కావడంతో అత్యవసర వైద్య సేవలు సైతం సకాలంలో అందక ఓ యువకుడు ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపింది. మణుగూరులోని సాంబయ్యగూడెం నుంచి రామాంజరం వరకు ప్రధాన రహదారిపై భారీ సంఖ్యలో ఇసుక లారీలు నిలిచిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సాధారణ ప్రజలతో పాటు అత్యవసర సేవలకు వెళ్లే వాహనాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో మణుగూరు బీటీపీఎస్‌లో రోజువారీ కూలీగా పనిచేస్తున్న కొమరం వంశీ (33) పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రయత్నించినప్పటికీ ట్రాఫిక్ అడ్డంకిగా మారింది. వాహనాలు కదలకపోవడంతో వంశీని కొంత దూరం చేతుల మీదుగా మోసుకెళ్లేందుకు ప్రయత్నించినా పరిస్థితి విషమించడంతో చివరకు ట్రాఫిక్ మధ్యలోనే అతడు మృతి చెందినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి దారి కల్పించడంలో వ్యవస్థ విఫలమైందంటూ ప్రజలు మండిపడుతున్నారు.

# ఖనిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



### - పలు రెస్టారెంట్లు, బేకరీల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూన్ 21 : గత వారం నమోదైన ఫుడ్ పాయిజనింగ్ ఘటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం గోదావరిఖని ప్రాంతంలోని పలు రెస్టారెంట్లు, బేకరీలలో ప్రత్యేక ఫుడ్ సేఫ్టీ తనిఖీ కార్యక్రమం నిర్వహించినట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఇన్‌చార్జ్) అంకిత్ రెడ్డి తెలిపారు. తనిఖీల్లో భాగంగా బాలాజీ వికాస్ స్వీట్ హౌస్, తాజ్ ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్, దసరా దావత్ రెస్టారెంట్, ఎస్ఏ అన్‌లిమిటెడ్ కేఫ్ అండ్ బేకర్స్, వాసంతి లైవ్ కిచెన్, ఏకే మల్టీబైట్స్ బేకర్స్, దియా ఫ్యామిలీ రెస్టారెంట్ (పన్నూర్), జైకా మండీ హౌస్, బేకర్స్ డిలైట్ ది లైవ్ కేక్ షాప్, డేనియల్స్ కేక్ షాప్ లను పరిశీలించారు. తనిఖీల్లో కొన్ని రెస్టారెంట్లు, బేకరీల్లో ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కొన్ని సంస్థల్లో ఆహార పదార్థాల తయారీలో నిషేధిత లేదా అనుమతి లేని ఆహార రంగులు ఉపయోగిస్తున్నట్లు గుర్తించి, వాటిని వెంటనే స్వాధీనం చేసుకుని, ఆ రంగులతో తయారు చేసిన ఆహార పదార్థాలను కూడా పారవేశారు. ఎస్ఏ అన్‌లిమిటెడ్ కేఫ్ అండ్ బేకర్స్ వంటగది పూర్తిగా అపరిశుభ్రమైన, అనారోగ్యకర పరిస్థితుల్లో ఉన్నట్లు గుర్తించిన అధికారులు, అక్కడ ఉన్న లోపాలను సరిదిద్దేందుకు యాజమాన్యానికి ఒక వారం గడువు విధించారు. నిర్దేశిత గడువులోపు నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా జైకా మండీ హౌస్ లో వినియోగిస్తున్న మయోనైస్ ముడి గుడ్లతో తయారు చేసినట్లుగా అనుమానం వ్యక్తం కావడంతో దాని నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపినట్లు తెలిపారు. ఆహార భద్రతా నిబంధనల ప్రకారం ముడి గుడ్లతో మయోనైస్ తయారు చేయడం అనుమతించబడదని అధికారులు పేర్కొన్నారు. నిర్వాహకులు పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఇన్‌చార్జ్) అంకిత్ రెడ్డి హెచ్చరించారు. గోదావరిఖని ప్రాంతంలో ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు.

ప్రజాలక్ష్యం

మంగళవారం 23 జూన్, 2026

# కుంటాలకు 65 లక్షల నిధులు మంజూరు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 22 : కుంటాల మండల కేంద్రంలో ప్రధాన కాలనీల్లో సిసి రోడ్స్, డ్రైన్స్ అవసరమైన విషయాన్ని కుంటాల సర్పంచ్ జక్కుల గజేంధర్ ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీనికి సానుకూలంగా స్పందిస్తూ కుంటాల మండల కేంద్రనికి 66 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగింది. ఈ విషయమై ప్రొసిడింగ్ కాపీనీ కుంటాల సర్పంచ్ జక్కుల గజేంధర్ ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది, సర్పంచ్ జక్కుల గజేంద్ర మాట్లాడుతూ అడిగిన వెంటనే కుంటాల గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే గారికి గ్రామస్తులు తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# పిడుగుపాటుకు ఆరు మేకలు, ఐదు గొర్రెలు మృతి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖానాపూర్, జూన్ 22 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పిడుగు పడి చౌటుపల్లి మల్లేష్ అనే వ్యక్తికి చెందిన ఆరు మేకలు, ఐదు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితులు మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం మేత కోసం సత్తెనపల్లి గ్రామం నుంచి పక్కనే ఉన్న అడవి సారంగాపూర్ అడవిలోనికి జీవాలను తీసుకొని వెళ్లగా వర్షానికి పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు .తన జీవాధారమైన మేకలు మరణించడంతో ఆర్థికంగా నష్టపోయా మని అధికారులు ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

# గాలివాన బీభత్సవం

**- విరిగిన విద్యుత్ స్తంభాలు, నేలకొరిగిన వృక్షాలు.**

**- పునరుద్ధరణ చర్యలు చేపట్టిన విద్యుత్ సిబ్బంది**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖానాపూర్, జూన్ 22 : సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వీచిన బలమైన ఈదురు గాలులు, భారీ వర్షాలకు కడెం, బీర్నంది ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ధర్మాజీపేట బీర్నంది అటవీ ప్రాంతంలో భారీ వృక్షాలు విద్యుత్ తీగలపై పడడంతో 33 కెవి కడెం,పెంబి ఫీడర్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో విద్యుత్ వాహకాలు తెగిపోయి, లైన్లకు భారీ నష్టం వాటిల్లింది. ప్రమాదాన్ని గమనించిన విద్యుత్ శాఖ అధికారులు బీర్నంది కడెం వైపు ఉన్న 33 కెవి జంపర్ ను తొలగించి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయంగా 33 కెవి జన్నారం ఫీడర్ ద్వారా మిగిలిన సబ్ స్టేషన్ లకు విద్యుత్తు పునరుద్ధరించినారు. విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మరమ్మత్తు పనులను ముమ్మరం చేశారు. భారీ వర్షాలు, అటవీ ప్రాంతం కావడంతో ఇబ్బందులు ఉన్నప్పటికీ అధికారులు యుద్ధ ప్రతిపాదికన పనులను చేయిస్తున్నారు. వీలైనంత త్వరగా కడెం బీర్నంది ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని ఏఈ రాం సింగ్ తెలిపినారు.

# డిటిఓగా వెంకట్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 22 : కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారిగా వెంకట్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన జిల్లా అధికారి రామచందర్ ఇటీవలబదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వికారాబాద్ లో జిల్లా రవాణా శాఖ అధికారిగా విధులు నిర్వహించిన వెంకట్ రెడ్డి ఆసిఫాబాద్ కు వచ్చారు. సోమవారం రవాణా శాఖ కార్యాలయంలో ఏవో అరుణ ,మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మసూద్అలీ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సంజయ్, రాజశేఖర్ లు ఆయనకు బొకే అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇక్కడి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.



# పాపన్నపేట చేనేత సహకార సంఘం

**- అధ్యక్షులుగా కొడపాక విట్టల్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూన్ 22 : మెదక్ జిల్లా, పాపన్నపేట చేనేత సహకార సంఘం సంఘానికి సోమవారం రోజు ఎన్నికలు నిర్వహించింది నట్లు ఎన్నికల అధికారి,జిల్లా సహకార అధికారి కార్యాలయం (మెదక్) టి.ఉమాశంకర్ సీనియర్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించి నట్లు తెలిపారు.అధ్యక్షులుగా కొడపాక విట్టల్, ఉపాధ్యక్షులుగా పల్లె సంగమేశ్వర,కోశాధికారిగా అచుకట్ల గురునాథం, కార్యదర్శిగా కొడపాక వెంకటేశం,డైరెక్టర్ లుగా దాసరి యాదయ్య, జుకంటి సంగయ్య,చామకుల మల్లయ్య, చింతకుంట రంగయ్య,పల్లె లక్ష్మణ్, కొడపాక సావిత్రిలు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భం గా చైర్మెన్ విట్టల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టినందుకు చేనేత కుల సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలుపు తున్నట్లు వెల్లడించారు.అన్ని విధాలుగా సంఘాన్ని,సంఘం సభ్యుల ను అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు.

# ఖని లో బేకరీ లు రెస్టారెంట్ లకు జరిమానా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటీ (గోదావరిఖని), జూన్ 22 : శుభ్రత లేని పరిస్థితుల్లో ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయిస్తున్నారని వచ్చిన సమాచా రం మేరకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదేశాలను సరించి ప్రజారోగ్య విభాగం అధికారులు సోమవారం నగరంలోని వివిధ బేకరీలు, రెస్టారెంట్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దసరా దావత్ కిచెన్, అన్ లిమిటెడ్, బేకర్స్ డిలైట్ షాపులకు రూ.2,000 రూపా యల చొప్పున జరిమానా విధించారు. ఈ తనిఖీలలో నగర పాలక సంస్థ శానిటరీ ఇన్స్పెక్టర్లు సంపత్ కుమార్, నాగ భూషణం, వార్డు ఆఫీసర్ రామకృష్ణ, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 22 : ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమానికి సంబంధించి జిల్లా ప్రత్యేక అధికారి సమీక్షా సమావేశానికి సిద్ధంగా ఉండాలన్నారు.

శాఖలవారీగా చేపట్టిన కార్యక్రమాలు, సక్సెస్ స్టోరీలు, నివేదికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించి "నషా ముక్త్ భారత్ అభియాన్" గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీ-1 లో స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్ పర్సన్ పర్యటన



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూన్ 22 : తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్, యువజన సేవల కమీషనర్ అకోయిజం సోనీబాలా దేవి సోమవారం ఆర్జీ–1 ఏరియాను సందర్శించారు. క్రీడాకారులు, క్రీడా శిక్షకులు, క్రీడా శాఖ అధికారులతో సమావేశమై గ్రామాలు, పట్టణాలు, సింగరేణి బొగ్గు గని ప్రాంతాల్లో క్రీడలను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలను వివరించారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం సింగరేణి అతిథి గృహం ప్రాంగణంలో పారిజాత మొక్కను నాటారు. సింగరేణి అటవీ విభాగం చేపడుతున్న హరితహారం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం లలిత్ కుమార్, డిప్యూటీ జీఎం (అటవీ) బానోత్ కర్ణ, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థకు చెందిన డిప్యూటీ డైరెక్టర్లు, అదనపు డైరెక్టర్లు, క్రీడా శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మత్తుకు 'నో' చెప్పండి..!

**- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు డీసీపీ భాస్కర్ పిలుపు**

**- విశ్వశాంతి కేరళ స్కూల్లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం**



(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల, జూన్ 22 : మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, హానికరమైన విషయాలకు ధైర్యంగా "నో" చెప్పాలని మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన వారోత్సవాల్లో భాగంగా శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వశాంతి కేరళ స్కూల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ.. విద్యార్థులు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై రూపొందించిన చిత్రాలను పరిశీలించిన డీసీపీ వారిని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. చిన్న ఆసక్తితో ప్రారంభమైన సిగరెట్, గుట్కా, ఇతర మత్తు పదార్థాల అలవాటు క్రమంగా వ్యసనంగా మారి నేరాలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డ్రగ్స్ విక్రయించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కొందరు యువకులు తెలిసో తెలియకో వాటి బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలంటే చిన్న వయస్సు నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలు గమనిస్తే వెంటనే తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాశ్, శ్రీరాంపూర్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, ఎస్ఐ సంతోష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆధునిక పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలి

**- మహిళా రైతులకు 100% సబ్సిడీపై సోయా విత్తనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 22 : ఆధునిక పద్ధతులు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించి, వ్యవసాయ రంగంలో మరింత ముందడుగు వేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. భైంసా లోని ఐకెపి కార్యాలయంలో కుభీర్, భైంసా, ముధోల్ మండలాల కు చెందిన మహిళ రైతులకు 670 బస్తాలను 100% సబ్సిడీపై పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూనె దినుసులను (పంటలను) ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. న్యూమో ఆయిల్ సీడ్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వం రాయితీలు అందిస్తుందన్నారు. మహిళలు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక పురోగతి సాధించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో ముందు ఉంచేలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. గ్రామ గ్రామాన మహిళా సమైక్య సంఘ భవనాలు నిర్మిస్తున్నామంటే అది కేంద్ర ప్రభుత్వం నిధులే అని తెలియజేశారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు సంఘ సభ్యులు ఘనంగా స్వాగతించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, ఆత్మ చైర్మన్ సిద్ధం వార్ వివేక్,దేగాం, తిమ్మాపూర్ సర్పంచ్లు సిరం సుష్మ రెడ్డి, సంజీవ్ ఐకెపి డిపిఎం శోభారాణి, విజయలక్ష్మి,మండల వ్యవసాయ అధికారి గణేష్, ఏపీఎం రమేష్, సీసీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# గిరిజన క్రీడా పాఠశాలను సందర్శించిన సాట్స్ వీసీ & ఎండీ డా.సోని బాలదేవి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 22 : ప్రజా పాలనలో భాగంగా జిల్లా స్పెషల్ ఆఫీసర్గా వచ్చిన తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. సోని బాలదేవి సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలను సందర్శించారు. కలెక్టరేట్లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం క్రీడా పాఠశాలకు చేరుకున్న డా. సోని బాలదేవి, విద్యార్థి క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో సాధించిన పతకాలు, ట్రోఫీలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని, క్రీడల ద్వారా ఆర్థికంగా ఎదిగి తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని ఆకాంక్షించారు. స్వాగతం పలికారు.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**- అనుమతులు లేకుండా సభలు, ర్యాలీలు, యాత్రలు నిషేధం**

**- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎస్పీ అఖిల్ మహాజన్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్ జూన్ 22 : జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్--1861 అమలులో ఉన్నట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, డీఎస్పీ లేదా అంతకంటే పై స్థాయి అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొందకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు లేదా ప్రజలు పెద్ద సంఖ్యలో గుమికూడే కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాగే అలాంటి కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లు, సన్నాహాలు కూడా చేయరాదని సూచించారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు లేదా నేరాలను ప్రేరేపించే వస్తువులను కలిగి ఉండటం పూర్తిగా నిషేధమని తెలిపారు. ప్రజా జీవనానికి అంతరాయం కలిగించే విధంగా జరిగే సమావేశాలు, జనసమూహాలు కూడా నిషేధిత పరిధిలోకి వస్తాయని పేర్కొన్నారు. అధిక శబ్దం వచ్చే డీజేలు, స్పీకర్లు, మైకులు, ప్రచార రథాలు తదితర ధ్వని పరికరాల వినియోగానికి అనుమతి లేదని ఎస్పీ తెలిపారు. అలాగే బైకులు, కార్లు, బస్సుల ద్వారా నిర్వహించే యాత్రలు, ర్యాలీలు కూడా సంబంధిత అధికారుల అనుమతి లేకుండా చేపట్టరాదని హెచ్చరించారు.



# టేలాలు తొలగించవద్దు

**- మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్ కు వినతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 22 : ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ఆనుకొని ఉన్న ఇరువైపుల టెలాలు తొలగించవద్దని చిరు వ్యాపారులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సి పల్ చైర్మన్ ఆకాష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్లకు విన్నవించారు. తమ పైన కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని తాము మున్సిపల్ కు టాక్స్ లు కడుతూ, ఆ టేలలపైనే అనేక సంవత్సరాల నుండి జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. డ్రైనేజీ రోజువారీగా శుభ్రం చేసుకుంటూ ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని చిరు వ్యాపారులు తెలిపారు. టేలాలు తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని విన్నవించడంతో సానుకూలంగా స్పందించిన మున్సిపల్ పాలకవర్గం చిరు వ్యాపారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, సాలం బిన్ అహ్మద్, బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సాయి శ్రావణ్, దూడల అశోక్, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# చట్ట ప్రకారం సమస్యలు పరిష్కరించాలి

## ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ నితిక పంత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, జూన్ 22 : కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితిక పంత్ ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 15 ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచిం చారు. జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు చేరువగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.



# మహిళల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

**- ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీలో బండి రమేష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్పల్లి, జూన్ 22 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి కానుక– ఇందిరమ్మ మహిళా శక్తి" చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం కూకట్పల్లి కేపీహెచ్బీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల అభివృద్ధి, ఆర్థిక సాధికారత కోసం అనేక సంక్షేమ పథకా లను అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహాలకు ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ వంటి పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచే దిశగా పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణలోనూ మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు 70 వేల మంది మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా ఈ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, పిడికిటి గోపాల్ చౌదరి, కిలారు శ్రీనివాస్, బాబు, రంగమోహన్, రజిత, కల్పన, వాణి, సుజాత, వనజ, జ్యోతి, రజిని, మైఖేల్, బాబ్జి, రమణ, వాసు, బొచ్చు మల్లి, తమ్మినేని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి

**- ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి**

**- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కోగిల బాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ములుగు, జూన్ 22 :ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని,ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కోగిల బాలు మాట్లాడుతూ,ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు,ఫర్నిచర్,తరగతి గదులు,విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా కేంద్రంలో ఎస్సీ,ఎస్ఎంహెచ్ విద్యార్థులకు వసతి కల్పించే హాస్టళ్లు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే హాస్టళ్లను మంజూరు చేసి విద్యార్థులకు మెరుగైన వసతి,భోజన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులపై భారాన్ని మోపుతున్నాయని,అందువల్ల ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకువచ్చి విద్యా వ్యాపారాన్ని నియంత్రించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే విద్యార్థులను సమీకరించి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బొచ్చు సందేశ్, కీర్తన, సింధు, ఉష, వర్ష తదితరులు పాల్గొన్నారు.

# కుంటాలకు 65 లక్షల నిధులు మంజూరు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 22 : కుంటాల మండల కేంద్రంలో ప్రధాన కాలనీల్లో సిసి రోడ్స్, డ్రైన్స్ అవసరమైన విషయాన్ని కుంటాల సర్పంచ్ జక్కుల గజేంధర్ ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీనికి సానుకూలంగా స్పందిస్తూ కుంటాల మండల కేంద్రనికి 66 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగింది. ఈ విషయమై ప్రొసిడింగ్ కాపీని కుంటాల సర్పంచ్ జక్కుల గజేంధర్ ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది, సర్పంచ్ జక్కుల గజేంద్ర మాట్లాడుతూ అడిగిన వెంటనే కుంటాల గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే గారికి గ్రామస్తులు తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# పిడుగుపాటుకు ఆరు మేకలు, ఐదు గొర్రెలు మృతి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖానాపూర్, జూన్ 22 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పిడుగు పడి చౌటుపల్లి మల్లేష్ అనే వ్యక్తికి చెందిన ఆరు మేకలు, ఐదు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితులు మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం మేత కోసం సత్తెనపల్లి గ్రామం నుంచి పక్కనే ఉన్న అడవి సారంగాపూర్ అడవిలోనికి జీవాలను తీసుకొని వెళ్లగా వర్షానికి పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు .తన జీవాధారమైన మేకలు మరణించడంతో ఆర్థికంగా నష్టపోయా మని అధికారులు ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

# గాలివాన బీభత్సవం

**- విరిగిన విద్యుత్ స్తంభాలు, నేలకొరిగిన వృక్షాలు.**

**- పునరుద్దరణ చర్యలు చేపట్టిన విద్యుత్ సిబ్బంది**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖానాపూర్, జూన్ 22 : సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వీచిన బలమైన ఈదురు గాలులు, భారీ వర్షాలకు కడెం, బీర్నంది ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ధర్మాజీపేట బీర్నంది అటవీ ప్రాంతంలో భారీ వృక్షాలు విద్యుత్ తీగలపై పడడంతో 33 కెవి కడెం,పెంబి ఫీడర్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో విద్యుత్ వాహకాలు తెగిపోయి, లైన్లకు భారీ నష్టం వాటిల్లింది. ప్రమాదాన్ని గమనించిన విద్యుత్ శాఖ అధికారులు బీర్నంది కడెం వైపు ఉన్న 33 కెవి జంపర్ ను తొలగించి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయంగా 33 కెవి జన్నారం ఫీడర్ ద్వారా మిగిలిన సబ్ స్టేషన్ లకు విద్యుత్ను పునరుద్ధరించినారు. విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మరమ్మత్తు పనులను ముమ్మరం చేశారు. భారీ వర్షాలు, అటవీ ప్రాంతం కావడంతో ఇబ్బందులు ఉన్నప్పటికీ అధికారులు యుద్ధ ప్రతిపాదికన పనులను చేయిస్తున్నారు. వీలైనంత త్వరగా కడెం బీర్నంది ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని ఏఈ రాం సింగ్ తెలిపినారు.

# డిటిఓగా వెంకట్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 22 : కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారిగా వెంకట్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన జిల్లా అధికారి రామచందర్ ఇటీవలబదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వికారాబాద్ లో జిల్లా రవాణా శాఖ అధికారిగా విధులు నిర్వహించిన వెంకట్ రెడ్డి ఆసిఫాబాద్ కు వచ్చారు. సోమవారం రవాణా శాఖ కార్యాలయంలో ఏవో అరుణ ,మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మసూద్అలీ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సంజయ్, రాజశేఖర్ లు ఆయనకు బొకే అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇక్కడి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.



# పాపన్నపేట చేనేత సహకార సంఘం

**- అధ్యక్షులుగా కొడపాక విట్టల్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూన్ 22 : మెదక్ జిల్లా, పాపన్నపేట చేనేత సహకార సంఘం సంఘానికి సోమవారం రోజు ఎన్నికలు నిర్వహించించి నట్లు ఎన్నికల అధికారి,జిల్లా సహకార అధికారి కార్యాలయం (మెదక్) టి.ఉమాశంకర్ సీనియర్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించి నట్లు తెలిపారు.అధ్యక్షులుగా కొడపాక విట్టల్, ఉపాధ్యక్షులుగా పల్లె సంగమేశ్వర,కోశాధికారిగా అచుకట్ల గురునాథం, కార్యదర్శిగా కొడపాక వెంకటేశం,డైరెక్టర్ లుగా దాసరి యాదయ్య, జూకంటి సంగయ్య,చామంతుల మల్లయ్య, చింతకుంట రంగయ్య,పల్లె లక్ష్మణ్, కొడపాక సావిత్రిలు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భం గా చైర్మెన్ విట్టల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టినందుకు చేనేత కుల సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలుపు తున్నట్లు వెల్లడించారు.అన్ని విధాలుగా సంఘాన్ని,సంఘం సభ్యుల ను అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు.

# ఖని లో బేకరీ లు రెస్టారెంట్ లకు జరిమానా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటీ (గోదావరిఖని), జూన్ 22 : శుభ్రత లేని పరిస్థితుల్లో ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయిస్తున్నారని వచ్చిన సమాచా రం మేరకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదేశాలను సరించి ప్రజారోగ్య విభాగం అధికారులు సోమవారం నగరంలోని వివిధ బేకరీలు, రెస్టారెంట్ లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దసరా దావత్ కిచెన్, అన్ లిమిటెడ్, బేకర్స్ డిలైట్ షాపులకు రూ.2,000 రూపా యల చొప్పున జరిమానా విధించారు. ఈ తనిఖీలలో నగర పాలక సంస్థ శానిటరీ ఇన్స్పెక్టర్లు సంపత్ కుమార్, నాగ భూషణం, వార్డు ఆఫీసర్ రామకృష్ణ, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎం ఇ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 22 : ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమానికి సంబంధించి జిల్లా ప్రత్యేక అధికారి సమీక్షా సమావేశానికి సిద్ధంగా ఉండాలన్నారు. శాఖలవారిగా చేపట్టిన కార్యక్రమాలు, సక్సెస్ స్టోరీలు, నివేదికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించి "నషా ముక్త్ భారత్ అభియాన్" గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీ-1 లో స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్ పర్సన్ పర్యటన



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూన్ 22 : తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్, యువజన సేవల కమీషనర్ అకోయిజం సోనీబాలా దేవి సోమవారం ఆర్జీ–1 ఏరియాను సందర్శిం చారు. క్రీడాకారులు, క్రీడా శిక్షకులు, క్రీడా శాఖ అధికారులతో సమావేశమై గ్రామాలు, పట్టణాలు, సింగరేణి బొగ్గు గని ప్రాంతాల్లో క్రీడలను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలను వివరించారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం సింగరేణి అతిథి గృహం ప్రాంగణంలో పారిజాత మొక్కను నాటారు. సింగరేణి అటవీ విభాగం చేపడుతున్న హరితహారం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను అభినందిం చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం లలిత్ కుమార్, డిప్యూటీ జీఎం (అటవీ) బానోత్ కర్ణ, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థకు చెందిన డిప్యూటీ డైరెక్టర్లు, అదనపు డైరెక్టర్లు, క్రీడా శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మత్తుకు 'నో' చెప్పండి..!

**- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు డీసీపీ భాస్కర్ పిలుపు**

**- విశ్వశాంతి కేరళ స్కూల్‌లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం**

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల, జూన్ 22 : మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, హానికరమైన విషయాలకు ధైర్యంగా "నో" చెప్పాలని మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన వారోత్సవాల్లో భాగంగా శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వశాంతి కేరళ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ.. విద్యార్థులు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై రూపొందించిన చిత్రాలను పరిశీలించిన డీసీపీ వారిని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు,



సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. చిన్న ఆసక్తితో ప్రారంభమైన సిగరెట్, గుట్కా, ఇతర మత్తు పదార్థాల అలవాటు క్రమంగా వ్యసనంగా మారి నేరాలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డ్రగ్స్ విక్రయించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కొందరు యువకులు తెలిసో తెలియకో వాటి బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలంటే చిన్న వయస్సు నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలు గమనిస్తే వెంటనే తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాశ్, శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, ఎస్ఐ సంతోష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆధునిక పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలి

**- మహిళా రైతులకు 100% సబ్సిడీపై సోయా విత్తనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 22 : ఆధునిక పద్ధతులు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించి, వ్యవసాయ రంగంలో మరింత ముందడుగు వేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. భైంసా లోని ఐకెపి కార్యాలయంలో కుభీర్, భైంసా, ముధోల్ మండలాల కు చెందిన మహిళ రైతులకు 670 బస్తాలను 100% సబ్సిడీపై పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూనె దినుసులను (పంటలను) ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. న్యూమో ఆయిల్ సీడ్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వం రాయితీలు అందిస్తుందన్నారు. మహిళలు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక పురోగతి సాధించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో ముందు ఉంచేలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని



చెప్పారు. గ్రామ గ్రామాన మహిళా సమైక్య సంఘ భవనాలు నిర్మిస్తున్నామంటే అది కేంద్ర ప్రభుత్వం నిధులే అని తెలియజేశారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు సంఘ సభ్యులు ఘనంగా స్వాగతించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, ఆత్మ చైర్మన్ సిద్ధం వార్ వివేక్,దేగాం, తిమ్మాపూర్ సర్పంచ్‌లు సిరం సుష్మ రెడ్డి, సంజీవ్ ఐకెపి డిపిఎం శోభారాణి, విజయలక్ష్మి,మండల వ్యవసాయ అధికారి గణేష్, ఏపీఎం రమేష్, సీసీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# గిరిజన క్రీడా పాఠశాలను సందర్శించిన సాట్స్ వీసీ & ఎండీ డా.సోని బాలదేవి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 22 : ప్రజా పాలనలో భాగంగా జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా వచ్చిన తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. సోని బాలదేవి సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలను సందర్శించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం క్రీడా పాఠశాలకు చేరుకున్న డా. సోని బాలదేవి, విద్యార్థి క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో సాధించిన పతకాలు, ట్రోఫీలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని, క్రీడల ద్వారా ఆర్థికంగా ఎదిగి తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని ఆకాంక్షించారు. స్వాగతం పలికారు.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు



**- అనుమతులు లేకుండా సభలు, ర్యాలీలు, యాత్రలు నిషేధం**

**- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎస్పీ అఖిల్ మహాజన్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్ జూన్ 22 : జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్--1861 అమలులో ఉన్నట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, డీఎస్పీ లేదా అంతకంటే పై స్థాయి అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొందకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు లేదా ప్రజలు పెద్ద సంఖ్యలో గుమికూడే కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాగే అలాంటి కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లు, సన్నాహాలు కూడా చేయరాదని సూచించారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు లేదా నేరాలను ప్రేరేపించే వస్తువులను కలిగి ఉండటం పూర్తిగా నిషేధమని తెలిపారు. ప్రజా జీవనానికి అంతరాయం కలిగించే విధంగా జరిగే సమావేశాలు, జనసమూహాలు కూడా నిషేధిత పరిధిలోకి వస్తాయని పేర్కొన్నారు. అధిక శబ్దం వచ్చే డీజేలు, స్పీకర్లు, మైకులు, ప్రచార రథాలు తదితర ధ్వని పరికరాల వినియోగానికి అనుమతి లేదని ఎస్పీ తెలిపారు. అలాగే బైకులు, కార్లు, బస్సుల ద్వారా నిర్వహించే యాత్రలు, ర్యాలీలు కూడా సంబంధిత అధికారుల అనుమతి లేకుండా చేపట్టరాదని హెచ్చరించారు.



# టేలాలు తొలగించవద్దు

**- మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్ కు వినతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 22 : ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ఆనుకొని ఉన్న ఇరువైపుల టెలాలు తొలగించవద్దని చిరు వ్యాపారులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సి పల్ చైర్మన్ ఆకాష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్లకు విన్నవించారు. తమ పైన కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని తాము మున్సిపల్ కు టాక్స్ లు కడుతూ, ఆ టేలలపైనే అనేక సంవత్సరాల నుండి జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. డ్రైనేజీ రోజువారీగా శుభ్రం చేసుకుంటూ ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని చిరు వ్యాపారులు తెలిపారు. టేలాలు తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని విన్నవించడంతో సానుకూలంగా స్పందించిన మున్సిపల్ పాలకవర్గం చిరు వ్యాపారు లకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, సాలం బిన్ అహ్మద్, బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సాయి శ్రావణ్, దూడల అశోక్, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# చట్ట ప్రకారం సమస్యలు పరిష్కరించాలి

**ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ నితిక పంత్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 22 : కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితిక పంత్ ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 15 ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచిం చారు. జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు చేరువగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.



# మహిళల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

**- ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీలో బండి రమేష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, జూన్ 22 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి కానుక– ఇందిరమ్మ మహిళా శక్తి" చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల అభివృద్ధి, ఆర్థిక సాధికారత కోసం అనేక సంక్షేమ పథకా లను అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహాలకు ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ వంటి పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచే దిశగా పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణలోనూ మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు 70 వేల మంది మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా ఈ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, పిడికిటి గోపాల్ చౌదరి, కిలారు శ్రీనివాస్, బాబు, రంగమోహన్, రజిత, కల్పన, వాణి, సుజాత, వనజ, జ్యోతి, రజిని, మైఖేల్, బాబ్జి, రమణ, వాసు, బొచ్చు మల్లి, తమ్మినేని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి

**- ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి**

**- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కోగిల బాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ములుగు, జూన్ 22 :ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని,ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కోగిల బాలు మాట్లాడుతూ,ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు,ఫర్నిచర్,తరగతి గదులు,విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో ఎస్సీ,ఎస్ఎంహెచ్ విద్యార్థులకు వసతి కల్పించే హాస్టళ్లు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే హాస్టళ్లను మంజూరు చేసి విద్యార్థులకు మెరుగైన వసతి,భోజన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులపై భారాన్ని మోపుతున్నాయని,అందువల్ల ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకువచ్చి విద్యా వ్యాపారాన్ని నియంత్రించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే విద్యార్థులను సమీకరించి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బొచ్చు సందేశ్, కీర్తన, సింధు, ఉష, వర్ష తదితరులు పాల్గొన్నారు.



## పలిమెల మండలంలో దోమల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

**- ప్రతి ఇంటికి ఉచితంగా దోమతెరలు పంపిణీ చేయాలి**

**- తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, జూన్ 22:వర్షాకాలం నేపథ్యంలో అత్యంత మారుమూల ప్రాంతమైన పలిమెల మండలంలోని గోదావరి సరిహద్దు గ్రామాల్లో ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తి పెరిగే ప్రమాదం ఉందన్నారు. దీంతో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధులు వ్యాప్తి చెందకముందే ప్రభుత్వం అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.గోదావరి సరిహద్దు గ్రామాల్లోని పేద కుటుంబాల రక్షణ కోసం ప్రతి ఇంటికి రెండు నుంచి మూడు దోమతెరలను ఉచితంగా పంపిణీ చేయాలని కోరింది. అలాగే గ్రామాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ నిర్వహించడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించింది. అదేవిధంగా మారుమూల గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక నిఘా ఉంచి,ముందస్తుగా వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన స్పందించి పలిమెల మండల ప్రజల ఆరోగ్య భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని పీక కిరణ్ కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ దాసరి రమేష్,కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఐత బాపు, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులుదారకొండ సూర్యశంకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అనుమతి లేని ఓవర్‌లోడ్ ఇసుక లారీలను నియంత్రించాలి

**- డీపీఓకు పలుగుల వార్డు సభ్యుల వినతి**

**- అక్రమ రవాణాపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, జూన్ 22:మహాదేవపూర్ మండలం పలుగుల గ్రామంలో అనుమతి లేకుండా గ్రామంలోని ఇళ్ల మధ్య నుంచి ఓవర్‌లోడ్ ఇసుక లారీలను నడుపుతున్నారని ఆరోపిస్తూ, వాటిని వెంటనే నియంత్రించాలని గ్రామ వార్డు సభ్యులు జిల్లా పంచాయతీ అధికారిణి (డీపీఓ) శ్రీలతకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. వార్డు సభ్యులు రాగం వెంకటమ్మ, కొట్టె రాజయ్య, జిల్లాల సంతోష్, నిట్టూరి రమేష్, నిట్టూరి రమాదేవి వినతిపత్రంలో పలు ఆరోపణలు చేశారు. గ్రామ పంచాయతీ పాలకవర్గ తీర్మానం లేకుండానే సర్పంచ్, ఉపసర్పంచ్‌లు క్వారీ యజమానులతో కుమ్మక్కై గ్రామంలోని అంతర్గత సీసీ రోడ్లపై భారీ ఇసుక లారీలను నడిపిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో గ్రామంలోని సీసీ రోడ్లు దెబ్బతింటున్నాయని, ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే టీజీఎండీసీ ఆధ్వర్యంలో రైతులకు ఎకరానికి రూ.50 వేల కౌలు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.25 వేలే చెల్లిస్తూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక లోడ్ పేరుతో ఒక్కో లారీ నుంచి రూ.1,500 నుంచి రూ.2,500 వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని కూడా వార్డు సభ్యులు ఫిర్యాదు చేశారు. అక్రమంగా నిర్వహిస్తున్న కాంటాలను సీజ్ చేసి, ఓవర్‌లోడ్ ఇసుక లారీల రవాణాను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్పందించిన జిల్లా పంచాయతీ అధికారిణి శ్రీలత, పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## యోగా ఆరోగ్యవంతమైన జీవనానికి మార్గదర్శి

**- నవభారత్ పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం**

**- విద్యార్థులతో యోగా ఆసనాల ప్రదర్శన**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూన్ 22:యోగా శారీరక, మానసిక ఆరోగ్యాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని నవభారత్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.కె. ప్రసాద్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని నవభారత్ పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామ విన్యాసాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ ఎన్.వి.కె. ప్రసాద్ మాట్లాడుతూ, యోగా ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించి ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రాణాయామం, ధ్యానం, వివిధ యోగా ఆసనాల ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. యోగా క్రమశిక్షణ, ఆత్మనియంత్రణ, సానుకూల ఆలోచనలను పెంపొందించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా ప్రదర్శనలు నిర్వహించగా, ఉపాధ్యాయులు వారికి మార్గనిర్దేశం చేశారు. యోగా దినోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## సింగరేణిలో బొగ్గు రవాణా అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నాం

**- బొగ్గు చోరీ, అదృశ్యంపై వస్తున్న కథనాల్లో వాస్తవం లేదు - డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) వెంకన్న జాదవ్.**

**- ఆధునిక సాంకేతిక వ్యవస్థలతో ప్రతి టన్ను బొగ్గుపై నిరంతర పర్యవేక్షణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, జూన్ 22: సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశను అత్యంత పారదర్శకంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షిస్తున్నామని సింగరేణి డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) వెంకన్న జాదవ్ తెలిపారు. బొగ్గు చోరీకి గురవుతోందని, బొగ్గు అదృశ్యమవుతోందని ఇటీవల కొన్ని వేదికల్లో వస్తున్న కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. సోమవారం భూపాలపల్లి ఏరియాలో పర్యటించిన ఆయన, ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డితో కలిసి కేటీకే ఓసీ–2 ఉపరితల గనిలోని లోడింగ్ బంకర్‌ను పరిశీలించారు. అక్కడి కార్యకలాపాలు, బొగ్గు లోడింగ్ ప్రక్రియ, భద్రతా చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భూపాలపల్లి జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, రవాణా, విక్రయాలకు సంబంధించిన అన్ని ప్రక్రియలు పూర్తిగా డిజిటల్ వ్యవస్థల ఆధారంగా నిర్వహించబడుతున్నాయని తెలిపారు. గనిలో బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి టన్ను బొగ్గుకు సంబంధించిన సమాచారం ఎస్.ఏ.పి., కోల్‌నెట్ తదితర ఆన్‌లైన్ వ్యవస్థల్లో నమోదు అవుతుందని చెప్పారు. సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా సరఫరా చేస్తున్నామని వివరించారు. రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా చేసే ప్రతి వాహనాన్ని ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్‌ల వద్ద తూకం వేయడంతో పాటు =ఖీ×ణ ఆధారిత బూమ్ బ్యారియర్లు, జీపీఎస్/జీపీఆర్ఎస్ ట్రాకింగ్, జియోఫెన్సింగ్ వ్యవస్థల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రైల్వే మార్గంలో ప్రతి వ్యాగన్‌కు సంబంధించిన లోడింగ్, డిస్పాచ్ వివరాలు డిజిటల్‌గా నమోదు అవుతున్నాయని పేర్కొన్నారు. గనులు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లు, వెయిబ్రిడ్జ్‌లు, రైల్వే సైడింగ్‌లు, స్టాక్ యార్డులు, ప్రవేశ–నిష్క్రమణ



కేంద్రాల్లో సీసీ కెమెరాలు, =ఖీ×ణ వ్యవస్థలు, చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, భద్రతా సిబ్బంది 24 గంటలూ పర్యవేక్షణ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆర్.ఎఫ్.ఐ.డి., జీపీఎస్, సీసీటీవీ, కోల్‌నెట్, ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్‌లు, హోలోగ్రామ్ చలానాలు, టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షణ, సింగరేణి సెక్యూరిటీ వ్యవస్థల వంటి బహుళస్థాయి భద్రతా చర్యల మధ్య జరిగే బొగ్గు ఉత్పత్తి, రవాణా ప్రక్రియలో చోరీ లేదా బొగ్గు అదృశ్యమవడం వంటి ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని వెంకన్న జాదవ్ స్పష్టం చేశారు. సింగరేణి యాజమాన్యం పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణకు కట్టుబడి ఉందని, సంస్థపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. బొగ్గు రవాణా వ్యవస్థను మరింత ఆధునీకీకరించేందుకు సంస్థ నిరంతరం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేటీకే ఓసీ–2 ప్రాజెక్టు అధికారి శ్యామ్ సుందర్, డీజీఎం (క్వాలిటీ) కృష్ణప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్, ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ టి. పోషమల్లు, గని మేనేజర్ రమాకాంత్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయికృష్ణ, పాత్రికేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కుంచపర్తి గ్రామంలో గుప్తనిధుల తవ్వకాల కలకలం

**- ఆలయ ప్రాంగణంలో అర్ధరాత్రి తవ్వకాలు.. 11 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**- గుప్తనిధుల కోసమా? ఆలయ అభివృద్ధి పనుల కోసమా? దర్యాప్తు ముమ్మరం.**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, జూన్ 22:ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కుంచపర్తి గ్రామంలో గుప్తనిధుల తవ్వకాల వ్యవహారం కలకలం రేపింది. గ్రామంలోని మారెమ్మ తల్లి ఆలయం, శివాలయం ప్రాంగణంలో అర్ధరాత్రి వేళ రహస్యంగా తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి విచారణ చేపట్టారు. గ్రామస్తుల కథనం ప్రకారం, గత ఐదు రోజులుగా ఆలయ పరిసరాల్లో గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపించాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆలయ ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో గుంటూరు, ఎన్కూరు ప్రాంతాలకు చెందిన 11 మంది కూలీలు అక్కడ ఉన్నట్లు గుర్తించారు. ప్రాథమిక విచారణలో తాము గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టేందుకు వచ్చినట్లు వారు తెలిపినట్లు సమాచారం. దీంతో ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. అయితే ఆలయ పూజారి స్వామీజీని విచారించగా, ఆలయ పరిసరాల్లో యంత్రాల ప్రతిష్ఠాపన కోసం మాత్రమే తవ్వకాలు చేపట్టినట్లు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఈ వ్యవహారంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటన స్థలం నుంచి పోలీసులు 11 ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగాయా, లేక ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగానే తవ్వకాలు చేపట్టారా అనే కోణాల్లో పోలీసులు లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో కుంచపర్తి గ్రామంలో ఉత్కంఠ నెలకొనగా, పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలనున్నాయి.

## డ్రోన్ టెక్నాలజీ భవిష్యత్ ఉపాధి అవకాశాలకు వేదిక

**- యువత నైపుణ్యాలను పెంపొందించుకుని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**

**- ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి - భూపాలపల్లిలో డ్రోన్ టెక్నీషియన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, జూన్ 22:ఆధునిక సాంకేతిక రంగంలో డ్రోన్ టెక్నాలజీకి విశేష ప్రాధాన్యత ఏర్పడిందని, భవిష్యత్తులో డ్రోన్ టెక్నీషియన్లకు విస్తృత ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అన్నారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. భూపాలపల్లి ఏరియాలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన డ్రోన్ టెక్నీషియన్ కోర్సు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, పరిశ్రమలు, గనులు, వ్యవసాయం, భద్రత, సర్వేలు, విపత్తు నిర్వహణ వంటి అనేక రంగాల్లో డ్రోన్ల వినియోగం వేగంగా పెరుగుతోందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డ్రోన్‌ల నిర్వహణ, మరమ్మతులు, సాంకేతిక అంశాలు, భద్రతా ప్రమాణాలపై శిక్షణార్థులకు సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆధునిక సాంకేతిక రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే సింగరేణి



సంస్థ లక్ష్యమని వెల్లడించారు. యువతను ఉద్యోగావకాశాలకు సిద్ధం చేయడంతో పాటు స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు సింగరేణి ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (క్వాలిటీ) కృష్ణప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యామ్ సుందర్, వీటీసీ మేనేజర్ నజీర్, అసిస్టెంట్ మేనేజర్ మహేశ్, ట్రైనర్ సందీప్, అధికారులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

**దాతల సహకారంతో విద్యా సామగ్రి, వాటర్ ప్యూరిఫైయర్ అందజేత**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 22:ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం ప్లేట్లు, గ్లాసులు, పెన్నులు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దాతలు అందించిన విద్యా సామగ్రి, ప్లేట్లు, గ్లాసులు, వాటర్ ప్యూరిఫైయర్‌ను విద్యార్థులకు, పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యా సామగ్రి అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. దాతలు వరగాని శ్రీనివాసరావు వాటర్ ప్యూరిఫైయర్‌ను, శ్రీ కోటి వెంకటరమణ ప్లేట్లు, గ్లాసులను, తేలపూడి శ్రీనివాసరావు పెన్నులు, నోటు పుస్తకాలను, వరగాని నాగేశ్వరావు ఇతర అవసరమైన సామగ్రిని పాఠశాలకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, గ్రామ శాఖ అధ్యక్షుడు రవి, పెద్దపొంగు ఉపేంద్ర, కోట వెంకటేశ్వర్లు, పొన్నెకంటి ఉప్పలయ్య, మోరు నాగేశ్వరరావు, దుబాన రాము, మోర్ గోపి, ఏపీపీసీ చైర్‌పర్సన్ విజయనిర్మల, గ్రామ పంచాయతీ కార్యదర్శి తిలక్, అంగన్‌వాడీ టీచర్ సునీత, యూపీఎస్ మరియు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌కు బీజేపీ కిసాన్ మోర్చా వినతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)





భద్రాద్రి–కొత్తగూడెం, జూన్ 22:రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికీ స్పష్టమైన వ్యవసాయ ప్రణాళిక లేదని విమర్శించారు. విత్తనాల పంపిణీ నుంచి పంటల కొనుగోలు వరకు ప్రభుత్వం అనుసరించే విధానంపై రైతులకు స్పష్టత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏ జిల్లాలో ఎంత విస్తీర్ణంలో ఏయే పంటలు సాగు చేయాలి, ఎరువుల లభ్యత ఎలా ఉంటుంది, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఎలా చేపడతారనే అంశాలపై ముందస్తు కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో నకిలీ విత్తనాల విక్రయాలు పెరిగిపోతున్నాయని, ముఖ్యంగా పత్తి, మిర్చి, వరి విత్తనాల పేరుతో కొందరు ప్రైవేట్ డీలర్లు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి నష్టపోయి అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుని, నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రబీ సీజన్‌కు సంబంధించిన పెండింగ్ రైతు భరోసా నిధులతో పాటు ప్రస్తుత ఖరీఫ్ సీజన్ రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ రూ.2 లక్షల వరకు సంపూర్ణ రుణమాఫీ అమలు చేయడంతో పాటు వ్యవసాయ కూలీలకు రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఎరువుల పంపిణీని యాప్ ఆధారిత విధానం కాకుండా నేరుగా రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని, యూరియా సహా ఇతర ఎరువుల కొరత లేకుండా చూడాలని సూచించారు. పంటల బీమా పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



## విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ.

### ప్రజావాణిలో వినతిపత్రం సమర్పణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, జూన్ 22:విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం భూపాలపల్లి జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ, జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని పేర్కొన్నారు. పేద విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగించేందుకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఫర్నిచర్ వంటి సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపే విధంగా బలవంతంగా పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి విద్యాసంస్థల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

## ఎస్సీ కార్పొరేషన్ ఎండీ హనుమంతు నాయక్‌కు శుభాకాంక్షలు

### మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకుడు బీరెల్లి రజినీకుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, జూన్ 22:హైదరాబాద్ లోని దామోదరం సంజీవయ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ హనుమంతు నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకుడు బీరెల్లి రజినీకుమార్ మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా హనుమంతు నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి, సంక్షేమ అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఎస్సీ వర్గాల అభ్యున్నతి, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించిన పలు విషయాలను ఈ సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో బీరెల్లి రజినీకుమార్‌తో పాటు ప్రముఖ నాయకుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం భూపాలపల్లి పట్టణ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, జూన్ 22:తెలంగాణ ఉద్యమకారుల ఫోరం భూపాలపల్లి పట్టణ కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా యాల్లా సురేందర్ ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా మారెల్లి సేనాపతి, నూనె రాజు, కరాటే శీను, అంబాల సంపత్, బట్టు సంపత్‌లను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పోలవేణి అశోక్ బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యదర్శులుగా కటకం సారంగపాణి, బొమ్మినేని సంతోష్, చిలుక నాగరాజు, గండిరాజు, ఆవుల తిరుపతిలను ఎంపిక చేశారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా మహమ్మద్ బాబర్ పాషా, మద్దెల విజయ్, సంయుక్త కార్యదర్శులుగా మోతే రాజు, చింతల నరసయ్యలను ఎన్నుకున్నారు. కోశాధికారిగా కేటీ చిత్రజన్, అధికార ప్రతినిధిగా అమృత అశోక్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పైసరి రాజు, ఉల్లేరావు శేఖర్, భీమారం దేవేందర్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మందల రవీందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పైడిపల్లి రమేష్, ఖ్యాత రాజు, సాంబమూర్తి, మేకల సంపత్, ముద్దమల్ల భార్గవ్, జిల్లా నాయకులు సూరా రాజేష్, బండారి రవి మాట్లాడుతూ ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

## విబీజీఆర్‌జీ పథకాన్ని ఉపసంహరించుకోవాలి

### నేడు కలెక్టరేట్ ఎదుట బీకేఎంయూ ధర్నా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 22:మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగిస్తూ, విబీజీఆర్‌జీ (ఎదీ+=జీ) పథకాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి విబీజీఆర్‌జీ పథకాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పని దినాలను తగ్గించడం, కూలీలకు గిట్టుబాటు కాని విధంగా వేతన వ్యవస్థను మార్చడం, పనుల వద్ద రెండు సార్లు ఫోటోలు తీసే విధానాన్ని అమలు చేయడం వంటి చర్యలు ఉపాధి హామీ పథకాన్ని క్రమంగా నిర్వీర్యం చేసే ప్రయత్నాల్లో భాగమేనని విమర్శించారు. వెంటనే విబీజీఆర్‌జీ పథకాన్ని రద్దు చేసి, పాత నిబంధనల ప్రకారమే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## డీటీఓ వెంకన్న మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు

### - బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం: ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

### - చెల్పూర్‌లో విధి నిర్వహణలో ఉండగా లారీ ఢీకొని జిల్లా రవాణా అధికారి మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్–భూపాలపల్లి, జూన్ 22:చెల్పూర్‌లో జిల్లా రవాణా అధికారి (డీటీఓ) వెంకన్న మృతి చెందిన రోడ్డు ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ తెలిపారు. ప్రమాదానికి దారితీసిన అన్ని అంశాలపై లోతుగా విచారణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో చెల్పూర్ ఆర్టీఓ కార్యాలయం సమీపంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. మార్ల ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీ (టూ22బి2687) జెన్‌కో వైపు వెళ్తుండగా, జిల్లా రవాణా అధికారి వెంకన్న తమ అధికారిక వాహనం నుంచి దిగి ఆర్టీఓ కార్యాలయ ప్రాంగణంలోకి సీజ్ చేసిన హార్వెస్టర్ వాహనాన్ని ప్రవేశపెట్టేందుకు రోడ్డుపై వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు. ఈ క్రమంలో లారీ డ్రైవర్ మహ్మద్ తస్లీమ్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాన్ని నడుపుతూ వెంకన్నను ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకన్న అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. ఘటన అనంతరం పోలీసులు వెంటనే స్పందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడా లేదా అనే అంశంతో పాటు వాహన వేగం, డ్రైవర్ నిర్లక్ష్యం తదితర కారణాలపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించారు. విధి నిర్వహణలో ఉండగానే జిల్లా రవాణా అధికారి వెంకన్న మృతి చెందడం జిల్లా వ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ఆయన మృతిపై అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దుపై వస్తున్న వార్తలను ప్రభుత్వం వెంటనే ఖండించాలి

### - లేదంటే జూన్ 25న హైదరాబాద్‌లో నిరసన దీక్ష: రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్

### - 'హలో ఉప సర్పంచ్ -- చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, జూన్ 22:ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయనున్నట్లు గత కొద్ది రోజులుగా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఖండించాలని ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జూన్ 25న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద భారీ స్థాయిలో నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు గట్టు ప్రదీప్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన "హలో ఉప సర్పంచ్–ఛలో హైదరాబాద్" పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్తీక్ ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచ్‌ల పాత్ర కీలకమని, వారి అధికారాలను తగ్గించే చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఉప సర్పంచ్‌ల హక్కులు, అధికారాల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గట్టు ప్రదీప్ గౌడ్ మాట్లాడుతూ, సర్పంచ్‌లతో పాటు ఉప సర్పంచ్‌లకు కూడా ప్రత్యేక విధులు, అధికారాలు కల్పించాలని కోరారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే అభివృద్ధి పనుల శిలాఫలకాలపై ఉప సర్పంచ్‌ల పేర్లు పొందుపరచడంతో పాటు తీర్మానాలపై సంతకాలు చేసే హక్కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉప సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు గౌరవ వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి శంకర్, చెమ్మల సుధీర్, స్వర్ణలత, శ్రవణ్, వివిధ మండలాల అధ్యక్షులు పిండి ప్రభాకర్, కృష్ణ, నాగరాజు, శ్రీజ, సంతోష్, శంకర్, కమలాకర్‌తో పాటు పలువురు గ్రామాల ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## డీటీఓ వెంకన్న మృతి జిల్లా యంత్రాంగానికి తీరని లోటు

### కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది: కలెక్టర్ రాహుల్ శర్మ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్–భూపాలపల్లి, జూన్ 22:జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) వెంకన్న ఆకస్మిక మృతి జిల్లా యంత్రాంగానికి తీరని లోటని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన సమర్థ అధికారిని కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. సోమవారం ఉదయం వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకన్న మృతి చెందడంతో జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఉంచిన ఆయన పార్థివ దేహాన్ని కలెక్టర్ రాహుల్ శర్మ సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా జగిత్యాల జిల్లా నుంచి భూపాలపల్లి జిల్లాకు వచ్చిన వెంకన్న తన విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి మంచి అధికారిగా గుర్తింపు పొందారని కలెక్టర్ పేర్కొన్నారు. అలాంటి అధికారిని కోల్పోవడం జిల్లా పరిపాలన వ్యవస్థకు తీరని నష్టమని అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన వెంకన్న 2012లో రవాణాశాఖలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి వివిధ హోదాల్లో సేవలందించారని తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సంతాప సభలో వెంకన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్వో వసంతకుమారి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## డీటీఓ వెంకన్న మృతి బాధాకరం

### - కుటుంబానికి అండగా ఉంటాం: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

### - నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, జూన్ 22:భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) వెంకన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉండగా చోటుచేసుకున్న ఈ విషాద ఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. సోమవారం గణపురం మండలం చెల్పూర్ గ్రామ సమీపంలోని ఆర్టీఓ కార్యాలయం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో వేగంగా వచ్చిన బొగ్గు లారీ ఢీకొనడంతో వెంకన్న తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం ఆసుపత్రికి తరలించినప్పటికీ చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఘటన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని వెంకన్న పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకన్న మృతి జిల్లా యంత్రాంగానికి తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్న అధికారుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### - ప్రజావాణిలో అందిన ప్రతి వినతికి సత్వర పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ అంకిత్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, జూన్ 22:ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణిలో అందిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను కలెక్టర్ అంకిత్ స్వీకరించారు. అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనలతో కలిసి ప్రజల సమస్యలను విని, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిగణించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, వెంటనే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. పరిష్కారానికి సమయం అవసరమయ్యే సమస్యలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా జాప్యం చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి సమస్య వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

# సింగరేణి ఉద్యోగుల సీఎంపీఎఫ్ పెన్షన్ క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలి

## జాప్యానికి తావులేకుండా సమన్వయంతో పనిచేయాలి

## డైరెక్టర్ (పా & ఫైనాన్స్) గౌతమ్ పోత్రు.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 22 : పదవీ విరమణ పొందుతున్న సింగరేణి ఉద్యోగుల సీఎంపీఎఫ్ (కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్) పెన్షన్ క్లెయిమ్‌ల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సింగరేణి సంస్థ డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోత్రు అధికారులను ఆదేశించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సీఎంపీఎఫ్ పెన్షన్ క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్న గౌతమ్ పోత్రు, సింగరేణి అధికారులు మరియు సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్లతో పెండింగ్ క్లెయిమ్‌ల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం పెన్షన్ ప్రయోజనాలు సకాలంలో అందేలా సింగరేణి అధికారులు సీఎంపీఎఫ్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. క్లెయిమ్‌ల పరిశీలన, ఆమోద ప్రక్రియలో అనవసర ఆలస్యాలకు తావు లేకుండా వేగవంతంగా సెటిల్‌మెంట్‌లు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్మిక సంక్షేమం



సింగరేణి సంస్థకు అత్యంత ప్రాధాన్య అంశమని పేర్కొన్న ఆయన, ఉద్యోగులు మరియు పెన్షనర్లకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి జీఎం (పర్సనల్--వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్) జి.వి. కిరణ్ కుమార్, జీఎం (పర్సనల్--ఐఆర్ అండ్ పీఎం) కవితా నాయుడు, జీఎం (ఎఫ్ అండ్ ఏ) ఎన్. చక్రవర్తి, హెచ్‌వోడీ (ఐటీ) ప్రాజెక్ట్ మేనేజర్ బి. హరప్రసాద్, డీజీఎం (పర్సనల్) ముకుంద సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే కొత్తగూడెం, గోదావరిఖని ప్రాంతాలకు చెందిన సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, సింగరేణి ఉద్యోగులు హాజరయ్యారు.



# అక్టోబర్ 2లోగా భువనగిరి కోట అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

## మంత్రి జూపల్లి కృష్ణా రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 22 : భువనగిరి కోటను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులను అక్టోబర్ 2 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం భువనగిరి కోట పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోట దిగువ భాగంలో నిర్మిస్తున్న రోప్‌వే, హోటల్, పార్కింగ్, రెస్ట్‌రూమ్స్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, రాక్ గార్డెన్ లైటింగ్ పనులతో పాటు కొండపై కోట పునరుద్ధరణ, వాటర్‌బాడీస్ బ్యూటిఫికేషన్, కేఫెటీరియా, ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, మెట్ల పునరుద్ధరణ, ఎంట్రన్స్ ప్లాజా, టికెట్ కౌంటర్, వెయిటింగ్ లాంజ్, రెస్టారెంట్ తదితర పనుల పురోగతిని సమీక్షించారు. పనుల్లో జాప్యం చోటుచేసుకోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి పగలు--రాత్రి పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద రూ.56.81 కోట్ల వ్యయంతో భువనగిరి కోటను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యాదాద్రి, భువనగిరి కోట, కొలనుపాకలను అనుసంధానిస్తూ ఆధ్యాత్మిక-వారసత్వ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. 2047 నాటికి తెలంగాణను అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక, సాంస్కృతిక, వారసత్వ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రోప్‌వే ఏర్పాటుతో పాటు ఆధునిక సదుపాయాల కల్పన ద్వారా దేశ, విదేశీ పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రోప్‌వే పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భువనగిరి కోటను రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, పురావస్తు శాఖ డైరెక్టర్ డా. అర్జునరావు, ఆర్డీవో కృష్ణారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులకు సరిపడా యూరియా అందించాలి : ముత్యాల విశ్వనాథం

## తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




పాల్వంచ, జూన్ 22 : రైతులకు సరిపడా యూరియా కట్టలు అందించడంతో పాటు బేషరతుగా రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎంఎస్) భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. సోమవారం పాల్వంచలో సీఆర్ భవన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేపట్టి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు, బ్యాంకు రుణాలు అందించాలని, యూరియా యాప్‌ను రద్దు చేసి అవసరమైన యూరియాను సరఫరా చేయాలని కోరారు. అలాగే రూ.2 లక్షల రుణమాఫీని షరతులు లేకుండా అమలు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువుల ధరలను తగ్గించాలని, అన్ని రకాల వరి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకాన్ని అమలు చేసి ప్రీమియంను ప్రభుత్వమే భరించాలని, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, రాష్ట్ర రైతు సంఘం నాయకులు వై.ఎస్. గిరి, శనిగారపు శ్రీనివాస్, సీపీఐ నాయకులు వేసంశెట్టి పద్మజ, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, బానోత్ రవి, వాడే లక్ష్మి, భానోత్ రంజిత్ తదితరులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# జూన్ 23న రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




పెబ్బేరు, జూన్ 22 : ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలకు నిరసనగా జూన్ 23న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఏబీవీపీ ప్రకటించింది. వనపర్తి జిల్లా పెబ్బేరు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో జిల్లా కన్వీనర్ దేవర్ల కార్తీక్ మాట్లాడుతూ, రేషనలైజేషన్ పేరుతో వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు ప్రోత్సాహం ఇస్తూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను దూరం చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీ నియంత్రణకు ప్రత్యేక చట్టం తేవాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25% ఉచిత ప్రవేశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ, నాన్-టీచింగ్, ఎంఈఓ పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని, గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించి నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు ప్రారంభమైనా యూనిఫాంలు అందించలేదని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థి వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉధృత ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జూన్ 23 బంద్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాభిమానులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివ, నగర కార్యదర్శి శివ, తరుణ్, జయరాం పాల్గొన్నారు.

# మత్తుకు విద్యార్థులు దూరంగా ఉండాలి...

## ఈగల్ ఫోర్స్ పిలుపు

## పెబ్బేరు జిల్లా పరిషత్ పాఠశాలలో డ్రగ్స్ అవగాహన సదస్సు

## డ్రగ్స్ సమాచారం ఉంటే 100 లేదా 8712671111కు తెలపాలని

## 2వ ఎస్సై దివ్యారెడ్డి సూచన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పెబ్బేరు, జూన్ 22 : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఈగల్ ఫోర్స్ తెలంగాణ ఆధ్వర్యంలో పెబ్బేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ 2వ ఎస్సై దివ్యారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దే శించి మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని, ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందని ఆమె హెచ్చరించారు. యువత ఎలాంటి చెడు వ్యసనాలకు లోను కాకుండా, చదువుపైనే దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. పట్టణంలో ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు గానీ, ఈగల్ ఫోర్స్ టోల్ ఫ్రీ నంబర్ 8712671111 కు గానీ తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై దివ్యా రెడ్డి తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎంఈఓ జయరాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండ్రాతి నరసింహగౌడ్, ఉపాధ్యాయులు శుభలక్ష్మి, ప్రసన్న కుమారి, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ మంజూరుకై మంత్రికి వినతి పత్రం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కల్వకుర్తి, జూన్ 22 : వెల్దండ నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కడ్తాల్ మండలంలోని నూతన ఎంపీడీఓ కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కు కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మంత్రి నూతన భవన నిర్మాణానికి సానుకూలంగా స్పందించారని గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి రషీద్, పసునోజు పురుషోత్తమాచారి, గుద్దటి కిష్టల్, మసిగుండ్ల వెంకటేష్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాదేపల్లి మల్లయ్య,,మరేపల్లి శ్రీనివాస్, మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సేవ్ మణుగూరు పోరాటాన్ని విజయవంతం చేయండి: ఎమ్మెల్యే కూనంనేని

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మణుగూరు, జూన్ 22 : మణుగూరు ప్రాంత భవిష్యత్తును కాపాడాలనే లక్ష్యంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షలను సోమవారం అంబేద్కర్ సెంటర్‌లో కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని, మణుగూరు ఓసీపీ మూసివేతకు ముందే ఎక్స్‌టెన్షన్ అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎండీఆర్ చట్టం ద్వారా బొగ్గు గనులను ప్రైవేటీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణలోని అన్ని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్, మణుగూరు ఓసీపీ అనుమతులు లభించకపోతే సింగరేణి, కాంట్రాక్టు కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడుతుందని అన్నారు. మణుగూరు అభివృద్ధి సింగరేణిపై ఆధారపడి ఉందని, బీటీపీఎస్, హెవీ వాటర్ ప్లాంట్, భద్రాచలం పేపర్ బోర్డ్ వంటి సంస్థలు కూడా సింగరేణి బొగ్గుతోనే అనుసంధానమై ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడం, రాజకీయ జోక్యమే సంస్థ ప్రస్తుత పరిస్థితికి కారణమని విమర్శించారు. సింగరేణి అభివృద్ధి, సేవ్ మణుగూరు ఉద్యమానికి సీపీఐ, ఏఐటీయూసీ కట్టుబడి ఉన్నాయని పేర్కొన్న ఆయన, డిమాండ్లు నెరవేర్చకపోతే అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షా శిబిరానికి మణుగూరు మెడికల్ షాప్ అసోసియేషన్, తెలుగుదేశం పార్టీ, టీయూసీఐ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ కె. రాజ్‌కుమార్, అడిషనల్ జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య, బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, సీపీఐ నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, దుగ్యాల సుధాకర్ తదితరులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూన్ 22 : ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్నపేట శివారులో జరిగింది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ...మండల పరిధి సోమ్లా తండాకు చెంది



నబానోవత్ రాంసింగ్ (78) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతని చిన్న కూతురు రేణుక ను టెక్మాల్ మండలం ముత్యాల బంధం తండాకు చెందిన నరేష్ కి ఇచ్చి పెళ్లి జరిపించారు. కొన్ని రోజులుగా కూతురు, అల్లుడు మధ్య సంసార విషయాల్లో గొడవలు చోటు చేసుకుంటున్నాయి. మళ్లీ గొడవ జరగడంతో రేణుక పుట్టింటికి వచ్చింది. ఆదివారం పాపన్నపేటలో అందరి సమక్షంలో రేణుకకు సముదాయించి ఆమె భర్త వద్దకు పంపేందుకు ప్రయత్నించగా రేణుకా అక్కడికి వెళ్ళేందుకు నిరాకరించింది. మనస్థాపం చెందిన రాంసింగ్ ఆదివారం రాత్రి సమయంలో పాపన్నపేట గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా హాస్పిటల్ కు తరలించి మృతుడి భార్య మీరి ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడికి తీవ్ర గాయాలు

## మెరుగైన చికిత్స కోసం హన్మకొండకు తరలింపు

## స్ట్రీట్‌లైట్లు లేకపోవడమే ప్రమాదానికి కారణమని కార్మికుల ఆరోపణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, జూన్ 22 : భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-1 ఇంక్లైన్ గనిలో సపోర్ట్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న సింగరేణి కార్మికుడు పెసర మహేష్ సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హన్మకొండకు తరలించినట్లు సమాచారం. తూండ్ల గ్రామానికి చెందిన మహేష్ భూపాలపల్లిలో ఇంటి అవసరాల కోసం సరుకులు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా రాత్రి 9 గంటలకు ప్రమాదానికి గురయ్యాడు. కేటీకే ఓసీ-2 నుంచి కేటీకే-1 గనికి వెళ్లే రహదారిపై గడ్డిగానిపల్లి గ్రామం సమీపంలోని మూలమలుపు వద్ద రోడ్డుపై నిలిపి ఉంచిన లారీని అతని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహేష్‌ను సమాచారం అందుకున్న తోటి కార్మికులు వెంటనే స్థానిక సింగరేణి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో హనుమకొండలోని మాక్స్‌కేర్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ ఘటనపై కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూపాలపల్లి కేటీకే ఓసీ-2 నుంచి కేటీకే-1 గని వరకు రహదారిపై స్ట్రీట్‌లైట్లు సక్రమంగా వెలగకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని వారు ఆరోపిస్తున్నారు. గత రెండు రోజులుగా వీచిన బలమైన గాలులకు రహదారిపై చెట్లు పడిపోవడంతో పాటు, సోమవారం మధ్యాహ్నం నుంచి మరమ్మతుల కోసం నిలిపి ఉంచిన లారీకి రిఫ్లెక్టివ్ రేడియం స్టిక్కర్లు లేదా హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. చీకటి, తగినంత వెలుతురు లేకపోవడం, రహదారిపై నిలిపి ఉంచిన వాహనానికి భద్రతా సూచనలు లేకపోవడం వంటి కారణాల వల్లే ఈ ప్రమాదం సంభవించిందని కార్మికులు చెబుతున్నారు. గనుల పరిసర ప్రాంతాల్లో రహదారి భద్రతా చర్యలను పటిష్టం చేయాలని, స్ట్రీట్‌లైట్లను వెంటనే పునరుద్ధరించాలని వారు సింగరేణి యాజమాన్యాన్ని కోరుతున్నారు.




# యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

## మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలి

## డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తప్పవు: ఎస్పీ హెచ్చరిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 22 : మాదక ద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పోలీసులు సమిష్టిగా కృషి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో "యాంటీ డ్రగ్ అవేర్‌నెస్" పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు యాంటీ డ్రగ్స్ పోస్టర్లు, బ్యానర్లు, ప్రత్యేక సెల్ఫీ పాయింట్లను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, పట్టణాలు, గ్రామాల్లో మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమాజంలో చైతన్యం పెరిగినప్పుడే డ్రగ్స్ రహిత వాతావరణాన్ని సృష్టించగలమని పేర్కొన్న ఎస్పీ, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహితుల వర్గం, రోజువారీ కార్యకలాపాలను గమనిస్తూ ఉండాలని సూచించారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కుటుంబ సభ్యులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాల్వంచలో 'టూ టౌన్' పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి : ఎస్‌జెకె అహ్మద్

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు వినతిపత్రం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, జూన్ 22 : పాల్వంచ పట్టణంలో 'టూ టౌన్' పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్.జె.కె. అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ, పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచలో జనాభా లక్ష దాటడంతో పాటు నేరాలు, వివాదాలు, శాంతిభద్రతల సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా బార్లు, మద్యం దుకాణాల పరిసరాల్లో రాత్రి వేళల్లో ఘర్షణలు జరుగుతున్నాయని, యువత మాదకద్రవ్యాలకు బానిసవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పట్టణానికి ఒకే పోలీస్ స్టేషన్ ఉండటంతో కేసుల దర్యాప్తు, శాంతిభద్రతల పర్యవేక్షణ, ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులపై అధిక భారం పడుతోందని పేర్కొన్నారు. పాల్వంచను టౌన్-1, టౌన్-2 పోలీస్ స్టేషన్ల పరిధిగా విభజిస్తే నిఘా వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు ప్రజలకు వేగవంతమైన పోలీసు సేవలు అందుతాయని ఎస్పీకి వివరించారు. పాల్వంచలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# కిష్టారం గ్రామంలో కత్తిపోట్ల కలకలం

## వ్యభిచార గృహం నిర్వహణపై వివాదం-ఇద్దరికి తీవ్ర గాయాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, జూన్ 22 ; ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన కత్తిపోట్ల ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వ్యభిచార గృహం నిర్వహణపై గ్రామ పెద్దలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో, వివాదం చెలరేగి, అది కత్తిపోట్లకు దారితీసింది. స్థానికుల కథనం ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరువూరు మండలానికి చెందిన నాగమణి, హనుమంతరావు దంపతులు కిష్టారం గ్రామ శివారులోని ఓ ఇంటిలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో కిష్టారం గ్రామానికి చెందిన పెద్దలు ఆదివారం అర్ధరాత్రి అక్కడికి వెళ్లి గ్రామ సమీపంలో ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించడం సరికాదని, వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని సూచించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. ఘర్షణ సమయంలో కొబ్బరి బొండాలు నరికేందుకు ఉపయోగించే కత్తితో గ్రామ పెద్దలపై దాడి చెయ్యగా, ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా వెంటనే సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైవే పక్కన ఉన్న గుడిసె వద్ద ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. వ్యభిచారం జరుగుతోందనే అనుమానంతో అడ్డుకునేందుకు వెళ్లిన సమయంలో ఈ దాడి జరిగినట్లు కాలనీ వాసులు చెబుతున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.






# ప్రతి శాఖ భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

**ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్**

**ప్రతి శాఖకు వచ్చే ఆరు నెలల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి**

**గ్రామ, వార్డు సభల దరఖాస్తుల స్థితిగతులపై నివేదిక రూపొందించాలి**

**ఆరోగ్య రంగంలో టీబీ, ఎన్‌సీడి కేసులపై నెలవారీ పురోగతి వివరాలు చూపించాలి**

**గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి**

**99 రోజుల కార్యక్రమం పురోగతి పై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ప్రత్యేక కార్యదర్శి**

ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 22 : జగిత్యాల జిల్లాలో ప్రతి శాఖ భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలిసి జిల్లా అధికారులతో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు పురోగతి పై ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల వారీగా 99 రోజుల కార్యక్రమాలపై నివేదికలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ..గ్రామ సభలు, వార్డు సభల ద్వారా ప్రజల నుంచి అందిన దరఖాస్తుల వివరాలు, వాటి ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గుర్తించిన వినూత్న కార్యక్రమాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని తెలిపారు. 99 రోజుల కార్యక్రమంపై రూపొందించే పుస్తకంలో జగిత్యాల జిల్లా విజయగాథలు, ఆవిష్కరణలు, వివిధ శాఖల విజయాలను సమగ్రంగా ప్రతిబింబించాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ విజయాలను తెలియజేసే మార్గదర్శకంగా ఉపయోగపడే విధంగా పుస్తకాన్ని ప్రత్యేకంగా రూపొందించాలని పేర్కొన్నారు. 99 రోజుల కార్యక్రమం అనంతరం ప్రతి శాఖకు సంబంధించిన తదుపరి ఆరు నెలల కార్యాచరణ ప్రణాళికను శాఖల వారీగా సిద్ధం చేయాలని తెలిపారు. విద్యా వారంలో చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి విద్యార్థుల ప్రస్తుత ప్రాథమిక స్థాయి, వచ్చే ఆరు నెలల్లో సాధించాల్సిన లక్ష్యాలను నిర్దిష్టంగా నిర్ణయించాలని సూచించారు. ప్రతి శాఖ సూక్ష్మ స్థాయిలో లక్ష్యాలను రూపొందించి ముఖ్యమంత్రి సమీక్ష సమావేశానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఆరోగ్య రంగంలో గుర్తించిన క్షయవ్యాధి (టీబీ), అంటువ్యాధులు కాని వ్యాధుల (ఎన్‌సీడీ) విషయంలో నెలనెలా సాధించిన పురోగతి వివరాలను స్పష్టంగా చూపించాలని తెలిపారు. గుర్తించిన కేసులు, చికిత్సలో వచ్చిన మెరుగుదలలను నివేదికల్లో ప్రతిబింబించాలని సూచించారు. వివిధ కార్యక్రమాలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్‌ను సేకరించి అవసరమైన మెరుగుదలలు చేపట్టాలని సూచించారు. విద్యాశాఖలో పాఠశాల స్థాయిలో తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి రంగంలో గత సంవత్సరంతో పోల్చి ఈ ఏడాది ఎంత మేరకు వృద్ధి సాధించామో విశ్లేషించి నివేదికల్లో ప్రతిబింబించాలని తెలిపారు. యువత, విద్యార్థులను క్రీడల వైపు మరింత ప్రోత్సహించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ, వార్డు స్థాయిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుత పరిస్థితులు, క్షేత్రస్థాయిలో పరిష్కరించిన సమస్యలను శాఖల వారీగా స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్ నిధులను జూన్ 30లోపు పూర్తిగా వినియోగించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. రైతు బోనస్ పొందిన రైతుల వివరాలు, వారికి కలిగిన ప్రయోజనాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ దరఖాస్తులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. రైతులకు యూరియా వినియోగాన్ని తగ్గించడం, పంటల వైవిధ్యీకరణ, ఆయిల్ పామ్ సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ భూముల్లో పంట అవశేషాలకు నిప్పంటించే ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యారంగంలో జగిత్యాల జిల్లా అద్భుతమైన ఫలితాలు సాధించిందని, ఇందుకు సంబంధిత అధికారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఉత్తమ ఫలితాల తరహాలోనే ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగేలా కృషి చేయాలని సూచించారు. కొత్త అడ్మిషన్లన్నీ ఆన్‌లైన్ ద్వారా పూర్తిచేయాలని, మధ్యాహ్న భోజన నాణ్యతను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో కమిటీల వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అల్పాహార పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. సీఎం కప్, క్రీడా కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో మరింత అవగాహన కల్పించి ఎక్కువ మంది పాల్గొనేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాల ద్వారా యువతకు లభిస్తున్న ఉపాధి అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్టీసీ బస్సులను లీజుకు ఇవ్వడం ద్వారా నెలకు సుమారు రూ.67 వేల ఆదాయం లభించే అవకాశాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ..మార్చి 06 నుంచి జూన్ 12 వరకు జిల్లాలో 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖల వారీగా చేపట్టిన కార్యక్రమాలపై నివేదికలను సమర్పించినట్లు తెలిపారు. మార్చి 06 నుంచి మార్చి 15 వరకు నిర్వహించిన పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్ కార్యక్రమంలో జిల్లాలోని 385 గ్రామాలు, 136 వార్డుల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి 1,545 ఫైళ్లను పరిష్కరించామన్నారు. 2,012 కిలోమీటర్ల రహదారులు, 1,603 కిలోమీటర్ల కాలువలను శుభ్రం చేశామని, కమ్యూనిటీ సోక్‌పిట్లు, వీఓ భవనాల నిర్మాణ పనులు చేపట్టడంతో పాటు అవసరమైన గ్రామాల్లో కొత్త బస్ స్టాప్‌ల నిర్మాణం ప్రారంభించామని అన్నారు. కొత్త బోర్‌వెల్లు, విద్యుత్ కనెక్షన్లకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించామని, ఏప్రిల్ 6 నుంచి 11 వరకు ఆరోగ్య వారోత్సవాలను నిర్వహించి 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, సురక్షిత మాతృత్వ దినోత్సవం, ప్రపంచ హోమియోపతి దినోత్సవం, డ్రగ్స్ కంట్రోల్ కార్యక్రమాలు నిర్వహించామని, ఏప్రిల్ 13 నుంచి 18 వరకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం కింద రోడ్డు భద్రతపై 182 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. ఏప్రిల్ 27 నుంచి మే 02 వరకు బాలల భద్రత వారోత్సవాలు నిర్వహించి అన్ని విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించామని, 27 కేసులను గుర్తించామని తెలిపారు. మే 04 నుంచి 10 వరకు వ్యవసాయ వారోత్సవాలను నిర్వహించి రైతు భరోసా, నానో యూరియా వినియోగం, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, వరి మిగులు దహనం నివారణ, వ్యవసాయ యాంత్రీకరణ, ఆయిల్ పామ్ సాగు, ప్రత్యామ్నాయ పంటలు, నేల ఆరోగ్య నిర్వహణపై విస్తృత ప్రచారం చేపట్టామన్నారు. మే 11 నుంచి 16 వరకు నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సంక్షేమ శాఖ మంత్రి చేత రూ.10 వేల ప్రోత్సాహక నగదు అందజేశామన్నారు. మే 18 నుంచి 23 వరకు యువజన, క్రీడా వారోత్సవాలు నిర్వహించామని, మే 25 నుంచి 30 వరకు 18 కొత్త అంగన్‌వాడీ భవనాలను నిర్మించగా, నాలుగు భవనాలను ప్రారంభించామని, మరో 18 భవనాలను ప్రారంభానికి సిద్ధం చేశామని తెలిపారు. మహిళల భద్రతపై 25 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.జూన్ 1 నుంచి 12 వరకు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. గృహ నిర్మాణ కార్యక్రమంలో మొత్తం 10,860 ఇళ్లకు మంజూరు లభించగా, 7,870 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. 1,532 ఇళ్లు పూర్తై సంక్షేమ వారోత్సవాల్లో గృహప్రవేశాలు నిర్వహించారు. జగిత్యాల జిల్లాలో అమలవుతున్న ఉత్తమ విధానాలు, గత ఏడాది సాధించిన ప్రగతి, ప్రస్తుత ఏడాది లక్ష్యాలు, ఈ ఏడాది నమోదైన వృద్ధి స్పష్టంగా కనిపించే విధంగా ప్రతి శాఖ 99 రోజుల కార్యక్రమ నివేదికలను రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రాబోయే రెండు నెలల్లో మొక్కల నాటకం లక్ష్యాలను పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. 99 రోజుల కార్యక్రమం పూర్తయిన అనంతరం ప్రత్యేక విలేకరుల సమావేశం నిర్వహించి జిల్లా విజయాలను ప్రజలకు తెలియజేస్తామని, కార్యక్రమం అమలులో ఉన్న సమయంలో కూడా ప్రత్యేక విజయగాథలను ప్రచారం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యాశాఖలో జగిత్యాల జిల్లా రాష్ట్రస్థాయిలో 17వ స్థానం నుంచి 4వ స్థానానికి చేరుకుందని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో 500 మంది విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించారని, 150 మంది విద్యార్థులు ఐ.ఐ.ఐ.టీ.లలో ప్రవేశాలు పొందినట్లు వెల్లడించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 65 వేల మంది విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలల ప్రవేశాల లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజా గౌడ్, సి.పి.వో సత్యం, జెడ్పి సిఈవో గౌతమ్ రెడ్డి, డి.ఆర్.డి.వో రఘువరన్, జిల్లా వైద్య శాఖ అధికారిణి సుజాత, డి.పి.వో మదన్ మోహన్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాజ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, భాస్కర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాలు ఎక్కడ?.. యూనిఫామ్ లు ఎక్కడ?

**ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై ఎస్ఎఫ్ఐ కలెక్టరేట్ ముట్టడి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 22 : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సోమవారం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, జిల్లా కార్యదర్శి లావుడియ రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం జూన్ 15 నాటికి విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందిస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో పంపిణీ జరగలేదని ఆరోపించారు. పాఠ్యపుస్తకాలలో కొన్ని టైటిల్స్ అందుబాటులో లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం అమలులోనూ సమస్యలు కొనసాగుతున్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు పెంచకపోవడంతో నాణ్యమైన భోజనం అందించడం కష్టమవుతోందన్నారు. కొన్ని ప్రాంతాల్లో భోజన నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో అనేక ప్రభుత్వ పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయని, వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, పుస్తకాలు, యూనిఫాంలు, షూలు తదితర వస్తువులను బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను తగ్గించే ప్రతిపాదనలను విరమించుకుని, జనాభా ప్రాతిపదికన కొత్త పాఠశాలలను ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలపై జిల్లా




విద్యాశాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ నాయకురాలు హిందువు రాణి, జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల రాహుల్, సహాయ కార్యదర్శులు తిగుల్ల శ్రీనివాస్, పుట్టల ఉదయ్, జిల్లా కమిటీ సభ్యులు నేహాల్, ప్రసన్న, అక్షిత, నరేందర్, అరవింద్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## టాస్క్ శిక్షణతో ఉపాధి అవకాశాలు పొందండి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, జూన్ 22 : తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్ ) ద్వారా యువతకు ఐటీ కోర్సులతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, ఎం ఎస్ ఆఫీస్ , డిజిటల్ మార్కెటింగ్, ట్యాలీ జి ఎస్ టి తదితర రంగాల్లో ఉచిత శిక్షణలు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో త్వరలో టాస్క్ శిక్షణా కేంద్రం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆసక్తి గల యువత ఈ శిక్షణలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం జిల్లా పరిశ్రమల కేంద్రం (డి ఐ సి ) జనరల్ మేనేజర్ లేదా జిల్లా ఉపాధి అధికారిని సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకుని మెరుగైన ఉపాధి అవకాశాలు పొందాలని కలెక్టర్ కోరారు.

## నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయండి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 22 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో జూన్ 23 నుంచి 30 వరకు విత్తన మేళానిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సోమవారం తెలిపారు. వచ్చే వానాకాలం సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం సూచించిన 7 సన్నరకాల వరి విత్తనాలు ఇందులో అందుబాటులో ఉంటాయని తెలిపారు.రైతులు ఒకే వేదికపై నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసుకోవడంతో పాటు, వ్యవసాయ శాఖ అధికారుల నుంచి విత్తనాల ఎంపిక, సాగు విధానాలు, పంట నిర్వహణపై సాంకేతిక సలహాలు పొందవచ్చని పేర్కొన్నారు.జిల్లాలోని రైతులందరూ సమీప రైతు వేదికలో నిర్వహించే విత్తన మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, జూన్ 22 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి మొత్తం 94 వినతులను స్వీకరించారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించిన 63, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు 8, మున్సిపాలిటీకి 6, సర్వే అండ్ ల్యాండ్ రికార్డులకు 6, జిల్లా పరిషత్‌కు 2, ఆర్‌అండ్‌బీ శాఖకు 2, విద్యాశాఖకు 2 అర్జీలు వచ్చాయి. అలాగే గనుల శాఖ, సంక్షేమ శాఖ, సోషల్ వెల్ఫేర్, ఎక్సైజ్, ప్రణాళికా శాఖలకు ఒక్కో దరఖాస్తు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి అర్జీపై నిర్దిష్ట గడువులో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కల్పనా, జడ్పీ సీఈవో శోభారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి ఎన్నారై చక్రధర్ 10 లక్షల భారీ విరాళం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, జూన్ 22 : పాలకుర్తి మండలం కుక్కల గూడూరు గ్రామంలో గల అమృత లింగేశ్వర సహిత శక్తి అమ్మ వార్ల దేవాలయంలో షెడ్డు నిర్మాణం కోసం సోమవారంఇదే గ్రామానికి చెందిన అమెరికా ఎన్నారై పోతరాజుల రాధా కిషన్ – అంబికా దేవి దంపతుల కుమారుడు చక్రధర్ పది లక్షల విరాళాన్ని అందించారని ఆలయ కమిటీ పేర్కొంది. సోమవారం నిర్వహించిన షెడ్డు నిర్మాణం భూమి పూజలో రాధా కిషన్ అంబికా దంపతులతో పాటు కుమారుడు చక్రధర్ పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన కుటుంబానికి అభినందనలు కృతజ్ఞతలను ఆలయ కమిటీ పేర్కొంది.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, జూన్ 22: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా సత్వ రమే పరిష్కరించి, సంబంధిత ఫిర్యాదు దా రులకు సమాచారం అందించడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్ (స్థానిక సంస్థలు), వినోద్ కుమార్ (రెవెన్యూ)తో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు తమ శాఖ పరిధిలో లేకపోతే సంబంధిత శాఖకు వెంటనే పంపించాలని, పరిష్కరించలేని అంశాలపై కారణాలను ఫిర్యాదుదారులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఏ దరఖాస్తునూ పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే సీఎం ప్రజావాణి, జిల్లా మంత్రి ప్రజావాణి ద్వారా వచ్చిన పెండింగ్ అర్జీలను కూడా వెంటనే పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. ఈ వారపు జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో 72 దరఖాస్తులు, ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 4 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సూర్యప్రకాశ్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, జెడ్పీ సీఈవో యాదయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## హక్కుల సాధన కోసం కొత్తగూడెం తరలివెళ్ళిన సీఎంఓఏఐ ప్రతినిధులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూన్ 22 : సింగరేణి అధికారుల పే అప్‌గ్రేడేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, జీతంలో భాగమైన పీఆర్‌పీ సాధన కోసం సోమవారం సాయంత్రం కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయం వద్ద సీఎంఓఏఐ ఆధ్వర్యంలో తలపెట్టిన భారీ ర్యాలీ, సమావేశానికి హాజరయ్యేందుకు ఆర్జీ-1 ఏరియా నుంచి సీఎంఓఏఐ ప్రతినిధులు పెరుమాళ్ల శ్రీనివాస్, కోల మల్లేశ్, అంజయ్య, దామోదర్, శ్రావణ్ కుమార్, హనుమంతరావు, శ్రీనివాస్, సంతోష్ తదితరులు బయలుదేరి వెళ్ళారు.

# నాంపల్లి కోర్టులో విచారణ

## - వర్చువల్‌గా హాజరైన హీరో అల్లు అర్జున్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 22 :సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో నాంపల్లి కోర్టు విచారణకు హీరో అల్లు అర్జున్ వర్చువల్‌గా హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకు నాంపల్లి కోర్టు అనుమతివ్వడంతోముంబై నుంచి వర్చువల్‌గా అల్లు అర్జున్ అటెండ్ అయ్యారు. ఈ కేసులో మిగిలిన నిందితులు వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరయ్యారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఏ 11 గా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. ఈరోజు(సోమవారం) ఉదయం సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ వ్యక్తిగతంగా కోర్టు ముందు విచారణకు హాజరుకావాల్సి ఉంది. సినిమా షూటింగ్‌ల కారణంగా అర్జున్ ముంబైలో ఉన్నారని, అక్కడి నుంచి వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన తరఫున న్యాయవాది మెమో దాఖలు చేయగా.. అందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో ఈరోజు మధ్యాహ్నం నాంపల్లి కోర్టు ముందు అల్లు అర్జున్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా హాజరయ్యారు. దీన్ని కూడా న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసు తదుపరి విచారణను నాంపల్లి కోర్టు జులై 6కు వాయిదా వేసింది. ఆరోజు కూడా కోర్టుకు అల్లు అర్జున్ వ్యక్తిగతంగా హాజరుకానున్నారా లేక వర్చువల్‌గానే అటెండ్ అవుతారా అనేది చూడాల్సి ఉంది.

# ఇందిరమ్మ రాజ్యాం.. ఇంటింటా సంక్షోభం

మొదటిపేజీ తరువాయి

సంక్షోభంలో ఉన్నారని.. పంటల కొనుగోలు విషయంలో రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయి రెండున్నరేళ్లు అయ్యిందని... అయినా ప్రజల మమకారం పోలేదని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రమంతటా గులాబీ జెండా రెపరెపలే కనిపిస్తున్నాయన్నారు. 'అధికారం ఎవరికీ శాశ్వతం కాదు... అధికారం మనకు మాత్రమే సొత్తు అనుకోవద్దు. ప్రజలకు మేలు చేస్తారేమో అని ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు' అని చెప్పారు. దేశం మొత్తం కాంగ్రెస్ అనే దరిద్రాన్ని వదిలించుకుందని.. కానీ 420 హామీలు ఇవ్వడంతో తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. మూడు నెలల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారని గుర్తుచేశారు. బాండ్ పేపర్లు ఇచ్చి, పథకాల వరద పారిస్తామన్నారని తెలిపారు. సీఎం రేవంత్ నోరు తెరిస్తే బూతుల బురద తప్ప... అభివృద్ధి ఏమీ లేదని మండిపడ్డారు. కండలు తిరిగిన ఉస్తాదు అయినా మూడు నెలల్లోనే పిల్లలను పుట్టిస్తారా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. మూడు నెలల్లోనే పిల్లలు పుట్టరని తెలుసని, కానీ 30 నెలల్లో పుట్టకపోతే ఏమనాలని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలనలో బూతుల మోతలు, పచ్చి అబద్ధాలు తప్ప ఏమీ లేవని మాజీ మంత్రి విమర్శించారు. ఢిల్లీ చేతుల్లో పాలన పెడితే నష్టం తప్పదని మొదటినుంచీ చెబుతున్నామని అన్నారు. వంద సార్లు ఢిల్లీకి పోయిన సీఎం రేవంత్.. రాష్ట్రానికి వంద పైసలైనా తెచ్చారా అని ప్రశ్నించారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే.. డబ్బుల సంచులన్నీ ఢిల్లీకి పంపిస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు ఎగొట్టి, యూరియా కోసం లైన్‌లలో నిలబడే పరిస్థితికి రైతులను తీసుకొచ్చారన్నారు. 30 నెలల్లో వినాశనం జరిగిందని.. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఓట్, సీట్ చోరీలో బిజెపి నిమగ్నం

మొదటిపేజీ తరువాయి

చోరీయే కాకుండా సీట్ల చోరీకి కూడా భాజపా పాల్పడుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మీనాక్షి నటరాజన్‌తో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు దోపిడీ చేసి ఇప్పుడు కేటీఆర్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ దోపిడీని ప్రజలు మరిచిపోయారనే భ్రమలో కేటీఆర్ ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలవడం ఖాయమని మహేశ్ కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సొంత ఎజెండాతో ముందుకెళ్తున్నారని.. అందుకే వాస్తవాలు చెప్పేందుకు ఇక్కడికి వచ్చామని మహేశ్ తెలిపారు. కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని నిలదీశారు. పదేళ్లలో జరిగిన దోపిడీ, అవినీతి, అక్రమాలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆస్తుల కోసం చెల్లిని గెంటేసిన కేటీఆర్ ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటు విషయంలో బీఆర్ఎస్ తీరు బీజేపీకి బలం చేకూర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తున్నామని.. కాస్త ఆలస్యం కావడంలో తమ తప్పిదం ఉందన్నారు. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# వర్షాకాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యం

## - రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్22 :రాష్ట్రంలో వర్షాకాలం సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారి రవాణా వ్యవస్థను నిరంతరం కొనసాగించడంతో పాటు, వరదల వల్ల రహదారులు, వంతెనలు, కల్వర్టులు తదితర మౌలిక సదుపాయాలకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు సమీక్ష నిర్వహించి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు..రాష్ట్ర రోడ్లు / భవనాల శాఖ ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను విడుదల చేసినట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇదివరకే తాను సమీక్షించిన అంశాల మేరకు ఆర్/బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల ఆర్ అండ్ బి అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని మంత్రి సూచించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం ముగిసే వరకు సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్‌వరకు అన్నిస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. త్యవసర పరిస్థితులను.. ఎదుర్కొనేందుకు జేసీబీలు, ఎక్స్కవేటర్లు,టిప్పర్లు, డీ-వాటరింగ్ పంపులు, ఇసుక సంచులు, కంకర, తారు, ఆర్‌సీసీ సామగ్రి, హెచ్‌డీపీఈ పైపులు తదితర అవసరమైన పరికరాలు, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు.రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రమాదం ఉన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులు, కట్టల బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి ప్రమాదకర ప్రాంతానికి ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ), తెలంగాణ డిజాస్టర్ ప్రివెన్షన్ అండ్ సేఫ్టీ పోర్టల్, తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పోలీస్,రెవెన్యూ, ఇరిగేషన్,విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. భారీ వర్షాలు,వరదలకారణంగా రహదారులు దెబ్బతిన్న వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని, వరద నీరు తగ్గిన వెంటనే తాత్కాలిక పునరుద్ధరణపనులుప్రారంభించాలని ఆదేశించారు. నష్టం జరిగిన 24 గంటల్లోపు ఫోటోలు, జీపీఎస్ వివరాలతో నష్టం అంచనా నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అత్యవసర పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఇంజినీర్లకు అప్పగించిన అధికారాల మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. వరదల కారణంగా చేపట్టే పునరుద్ధరణ పనుల వ్యయాన్ని ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఎంఎఫ్ నిబంధనల ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు.

# పిల్లకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యా యత్నం

## పిల్లలు మృతి...చావు బతుకల్లో తల్లి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం,జూన్22 :స్వగ్రామానికి మకాం మార్చే విషయంలో భర్తతో ఓ భార్య పడిన ఘర్షణ చివరికి వారి పిల్లల ప్రాణాలను తీసేదాకా వెళ్లిన ఘటన ఖమ్మం జిల్లా కేంద్రంలో వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు .. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ గుర్రాలపాడుకు చెందిన బొబ్బిలి లింగరాజు, స్వాతి దంపతులు కొద్ది నెలలుగా ఖమ్మం త్రీటౌన్ గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు.

వీరికి వేదక్‌కుమార్ (7), తనీశ్ (4) అనే కుమారులున్నారు. లింగరాజు ఓ సెల్‌ఫోన్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా షాపు నడుపలేనని, ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకోవాలని లింగరాజుకు సెల్‌ఫోన్ షాపు యజమాని చెప్పాడు. లింగరాజు ఇదే విషయాన్ని భార్యకు చెప్పాడు. స్వగ్రామానికి వెళ్లి వేరే పని చూసుకుందామని చెప్పగా భార్య స్వాతి నిరాకరించింది. ఇదే విషయమై రెండు రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్తపై కోపం పెంచుకున్న భార్య.. శనివారం లింగరాజు ఇంట్లో లేని సమయం చూసి.. బిస్కెట్లకు ఎలుకలమందు పూసి పిల్లలకు తినిపించింది. అనంతరం ఏమీ తెలియనట్టు భర్తకు ఫోన్ చేసింది. పిల్లలకు వాంతులు అవుతున్నాయని, త్వరగా ఇంటికి రావాలని చెప్పింది. దీంతో హుటాహుటిన ఓ మెడికల్ షాపునకు వెళ్లిన లింగరాజు.. వాంతులు తగ్గేందుకు ఓ సిరప్ తీసుకొని ఇంటికి వచ్చాడు. పిల్లలకు తాగించి పడుకోబెట్టాడు. విష ప్రభావంతో పెద్ద కుమారుడు వేదక్‌కుమార్ నిద్రలోనే కన్నుమూశాడు. చిన్న కుమారుడు తనీశ్‌కు ఆదివారం ఉదయం వాంతులు కావడంతో ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. పిల్లల పరిస్థితి విషమిస్తున్న తరుణంలో స్వాతి సైతం ఎలుకలమందు తినడంతో స్థానికులు ఆమెను దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నది. ఖమ్మం త్రీటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. ఫాదర్స్‌డే రోజున ఓ తండ్రి తన పిల్లలను కోల్పోవడం విషాదాన్ని మిగిల్చింది.

# బోధన్ మున్సిపాలిటీలో కౌన్సిలర్ల నిరసన

## మూడు నెలలయినా సమావేశం పెట్టనందుకు ఆవేదన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిజామాబాద్,జూన్22 :బోధన్ పట్టణంలోని మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటై ముడు నెలలు గడుస్తున్నా సమావేశం నిర్వహించడం లేదని బోధన్ మున్సిపాలిటీలో మున్సిపల్ కౌన్సిలర్లు సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీర్ ఇలియాజ్ అలీ ఆధ్వర్యంలో ఎంఐఎం కౌన్సిలర్లు కార్యాలయం ఆవరణలో టెంట్ వేసి కుర్చీలలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పాలక వర్గం ఏర్పాటై మూడునెలలు పూర్తయినా నెలవారీ సమావేశాలు నిర్వహించడం లేదని మండిపడ్డారు. అంతేకాకుండా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు కూడా స్పందించడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు విన్నవించామని ఆయన స్పందించకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ లో సమావేశలు నిర్వహించని కారణంగానా తామే కార్యాలయం ఆవరణలో టెంట్, కుర్చీలు వేసి అధికారులను ఆహ్వానించామన్నారు. అధికారులు ఇక్కడకు కూడా రాక పోవడంతో తమ సమస్యలతో కూడిన వినతిపత్రం ఖాళీ కుర్చీకి అందచేసి నిరసన వ్యక్తం చేశారు. అధికారుల వైఫల్యం కారణంగా సమస్యల పరిష్కారం లో వార్డుల్లో ప్రజలకు ఏం చెప్పాలో తెలియక వార్డుల్లో తిరగడం కూడా మానివేశామని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ సమావేశాలు నిర్వహించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు హెచ్చరించారు.

# తెలంగాణ అభివృద్ధికి బిఆర్ఎస్ మోకాలడ్డు

మొదటిపేజీ తరువాయి

సూపర్ హిట్ అనుకుంటున్నారా...అని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో మిగులు రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన షోలే సినిమా కాదని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్ల పాలన గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి క్రాప్ డైవర్షన్‌పై అవగాహన కల్పిస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో పండించిన ధాన్యం అత్యధిక దిగుబడి వస్తే కేంద్రప్రభుత్వం ఎందుకు కొనట్లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారని తెలిపారు. మెట్రోఫేజ్- 2 కోసం సంప్రదింపులు చేసి ఎల్ అండ్‌టీకి ఎగ్జిట్ ఇచ్చారని.. మెట్రోఫేజ్ -2ను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. మెట్రోఫేజ్-2పై బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మెట్రోఫేజ్ -2పై కిషన్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారని ప్రస్తావించారు. కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్ ఇప్పించాలని.. కలిసి అభివృద్ధిలో ముందుకెళ్దామని సీఎం అంటున్నారని అన్నారు. కేటీఆర్ బాధ్యతతో ప్రజల కోణంలో మాట్లాడాలని హితవు పలికారు. హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. హైడ్రా హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలకంగా మారిందని తెలిపారు. నాళాలు కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టాలని హైడ్రా భావిస్తోందా...? అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం ముంపునకు గురికాకుండా హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. బీజేపీ ఓటు, సీటు చోరీల గురించి కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదన్న ÷ర్ అయ్యారు. కేటీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై చిత్తశుద్ధి లేని మాటలు మాట్లాడుతున్నారని కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నటుడు చిరంజీవితో బిజెపి అధ్యక్షుడు రామ్ భేటీ

మొదటిపేజీ తరువాయి

కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సంస్కరణలను వివిధ రంగాల ప్రముఖులకు వివరించే ప్రయత్నం జరుగుతోంది. అందులో భాగంగానే రామచందర్ రావు చిరంజీవిని కలిసి మోదీ ప్రభుత్వ పనితీరుకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాలు, ప్రచార పత్రాలను అందజేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సామాజిక రంగాల్లో జరిగిన మార్పులపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. అధికారికంగా ఇది మర్యాదపూర్వక భేటీగా చెబుతున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం పలు విశ్లేషణలు కొనసాగుతున్నాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన చిరంజీవి, అనంతరం ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాల్లో బిజీ అయిన ఆయన మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి వస్తారా? అనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యంగా బీజేపీతో ఆయన సాన్నిహిత్యం పెరుగుతుందా అనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. చిరంజీవి తమ్ముడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్‌కు బీజేపీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిరంజీవి-బీజేపీ భేటీకి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఈ సమావేశం కేవలం మర్యాదపూర్వకంగానే జరిగిందా? లేక భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు సంకేతమా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# ఆర్డీఎస్ నీటిపై రాజీలేదు

మొదటిపేజీ తరువాయి

లని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తుంగభద్ర నీటి పంపిణీ అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఎగువ రాష్ట్రాల చర్యల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగు అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ట్రిబ్యునల్, బోర్డులు, అంతర్రాష్ట్ర సమావేశాల్లో తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని చెప్పారు. చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చిచెప్పారు. రైతుల సాగునీటి అవసరాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్ని అయినా తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. తెలంగాణ రైతుల హక్కులు, సాగునీటి భద్రత కోసం ప్రభుత్వం అన్ని వేదికలపై పోరాడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

మొదటిపేజీ తరువాయి

రమేశ్‌తోపాటు నియోజకవర్గానికి చెందిన నేతలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని మర్చిపోం.. మనమీద కేసులు పెట్టినోడిని మరిచిపోం. మనతో నిలబడినోళ్లను కూడా మరిచిపోమన్నారు. తప్పకుండా చెప్తున్నా.. నేను కేసీఆర్ సారంతా మంచోన్నైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది.. పక్కా విడిచిపెట్ట. రిటైరైనా పారిపోయినా సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. ఎవడెవడైతే మా కార్యకర్తలను సతాయించిండో ఒక్కొక్కడిని వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది.. వదిలిపెట్టే సమస్యే లేదన్నారు. ఇది నేనేం ఊరికే చెప్పడం లేదు.. గుర్తు పెట్టుకోండి. కానీ రమేశన్న (ఆరూరి రమేశ్) వీడు మంచోడేనే అన్నా అని మళ్లా వారిని తీసుకొని రావొద్దని కేటీఆర్ సూచించారు.

# భువనగిరి కోటకు పూర్వ వైభవం

మొదటిపేజీ తరువాయి

ప్రయాణికులు ఖిల్లా పైకి వెళ్లేలా రోప్ వే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట , భువనగిరి ఖిల్లా, కొలనుపాక సోమేశ్వర ఆలయం, స్వర్ణగిరి కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన టూరిజం శాఖను దేశంలో నంబర్ వన్‌గా గుర్తింపు తీసుకొస్తామని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో చారిత్రక కట్టడాలు ఉన్నాయన్నారు. వాటిని ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసి వందలాది మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. నెలకు రెండు రోజులైనా టూరిజంకు సమయం కేటాయించాలని తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పర్యాటక స్థలాలకు వెళ్తే ప్రజల ఆలోచనా విధానం మారుతుందని... అనేక మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

# భూమి గురించి అడిగితే ఎస్‌బిఐపై పగబట్టారు

మొదటిపేజీ తరువాయి

భూమి రేవంత్ రెడ్డి ఎట్లా అమ్ముకున్నడు.. అని హైకోర్టుకు పోయారన్నారు.కోర్టు వాళ్లు పైసలు పెట్టి కొన్నది నిజమే కదా ఈ అమ్మకం తప్పు అని స్టే ఇచ్చింది. ఖతం రేవంత్ రెడ్డి ఎస్‌బీఐ మీద పగపట్టిండు. ఎస్‌బీఐని నిషేధిస్తాం. ఎస్‌బీఐలో ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లు బయటకు తీసేస్తాం. ఎస్‌బీఐకి రాష్ట్ర ప్రభుత్వానికి ఉండే ఖాతాలన్ని తీసేస్తా.. అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కూడా బ్లాక్ మెయిల్ చేస్తుండు.. రేవంత్ రెడ్డి తీరు ఎవరన్నా ప్రశ్నిస్తే పగబడ్తమన్నట్టు ఉంది. ఇవాళ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియానే నిషేధిస్తా అంటున్నడు.. రేపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వరల్డ్ బ్యాంక్ కూడా నీ మాట వినలేదనుకో దాన్ని కూడా నిషేధిస్తా అంటాడు అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఒక ఒక బ్యాంక్ అయితే కావాలి కదా.. ఎవరు నీకు వ్యతిరేకంగా మాట్లాడితే ఆ బ్యాంక్‌నే నిషేధిస్తా అంటే మరి ఏం చేస్తడు.. నాకో డౌటు..కొత్తగా కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెడ్తడో ఏమో.. పెట్టినా పెడ్తడు మస్త్ జమ అయినయ్ పైసలు. రేపు ఎనుముల కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెట్టినా పెడ్తరన్నారు హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం

మొదటిపేజీ తరువాయి

సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎమ్ఆర్‌వో , హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హస్తిన పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణభూములు బదలాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందువల్ల ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై బూత్ లెవెల్ ఏజెంట్లతో మంత్రి దామోదర్ రాజనర్సింహ అవగాహన సమావేశం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, జూన్ 22: ఆందోల్ నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై ఆందోల్, వట్పల్లి, పుల్కల్, చౌటకూరు మండలాలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్స్‌లతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డిలోని తన నివాసంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను గుర్తించి సవరణలు చేపట్టేందుకు కృషి చేయాలని, అర్హులైన ఓటరు కూడా జాబితా నుండి తప్పిపోకుండా చూడాలని అన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్న మంత్రి దామోదర. ప్రతి ఓటరులో తమ ఓటు హక్కుపై అవగాహన పెంపొందించే దిశగా బూత్ లెవెల్ ఏజెంట్లు పనిచేయాలని కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రతి ఏజెంట్ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, దాని ముఖ్య ఉద్దేశాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆందోల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై బూత్ లెవెల్ ఏజెంట్లతో మంత్రి దామోదర్ రాజనర్సింహ అవగాహన సమావేశం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, జూన్ 22 : ఆందోల్ నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై ఆందోల్, వట్పల్లి, పుల్కల్, చౌటకూరు మండలాలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్స్ (బిఎల్ఏ)లతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డిలోని తన నివాసంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను గుర్తించి సవరణలు చేపట్టేందుకు కృషి చేయాలని, అర్హులైన ఓటరు కూడా జాబితా నుండి తప్పిపోకుండా చూడాలని అన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్న మంత్రి దామోదర. ప్రతి ఓటరులో తమ ఓటు హక్కుపై అవగాహన పెంపొందించే దిశగా బూత్ లెవెల్ ఏజెంట్లు పనిచేయాలని కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రతి ఏజెంట్ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, దాని ముఖ్య ఉద్దేశాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆందోల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ పరిధి ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యం

### 30వ డివిజన్ సందర్శనలో మేయర్ మహాకాళి స్వామి కార్పొరేటర్ అంజయ్య



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, జూన్ 22 : రామగుండం కార్పొరేషన్ పట్టణ పరిధి 30 డివిజన్ ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆశీస్సులతో పనిచేస్తున్నామని రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి అన్నారు. శనివారం 30 డివిజన్‌లో కార్పొరేటర్ ఇసంపల్లి అంజయ్యతో కలిసి ఖాదర్ కాలనీ ఇందిరానగర్ రహమత్ నగర్ భీమయ్య కాలనీ వడ్డెర గూడెం ఈఎస్ఐ కాలనీ టెంపుల్ ఏరియా తదితర కాలనీలో డివిజన్ పర్యటనలో ప్రజల అవసరాలను తెలుసుకుంటూ కల్పించాల్సిన వసతుల పై పరిశీలిస్తూ పర్యటన అనంతరం మాట్లాడారు. కాలువల్లో పేరుకుపోయిన కాలువల్లో పూడికను దారికి అడ్డంగా పెరిగిన పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశిస్తూ మేయర్ మహంకాళి స్వామి కార్పొరేటర్ అంజయ్య నేరుగా పాల్గొని డివిజన్ ప్రజలను ఆశ్చర్యపరిచారు. రామగుండం ఎమ్మెల్యే మక్కా సింగ్ రాజ్ ఠాకూర్ తాను పుట్టి పెరిగిన రామగుండం అద్భుతంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా 20 కోట్ల నిధులను కేటాయించి స్వయంగా నిర్వహిస్తున్న పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారని మేయర్ స్వామి గుర్తు చేశారు. ప్రస్తుతం రామగుండంలో జరుగుతున్న రోడ్డు సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులతో పట్టణ రూపురేఖలు మారిపోయాయని అన్నారు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అభివృద్ధి ఆశయానికి తగ్గట్టుగా 30 డివిజన్లో వీధులు కూడా వెడల్పు చేయడానికి ప్రధాన రోడ్డు నిర్మాణం కోసం 20 అడుగులు ఉండేలా మార్కింగ్ ఇస్తున్నామని అన్నారు. మార్కింగ్ అనుసరించి వారం రోజుల్లోపు స్వచ్ఛందంగా సంబంధిత ప్రజలు నిర్మాణాలను తొలగించుకుంటే రోడ్డు పనులు ప్రారంభిస్తారని అన్నారు ప్రతి వీధి చివరి ఇంటి వరకు యూజీడి రోడ్డు నల్ల వీధి దీపాల వంటి అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సంకల్పించారని అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మేయర్ మహంకాళి స్వామి అన్నారు, తాగునీటి కొరత తీర్చేందుకు రామగుండంలో మరో కొత్తవాటర్ ట్యాంక్ నిర్మాణం కూడా చేపడతామని అన్నారు స్వచ్ఛ రామగుండంగా తీర్చిదిద్దేందుకు డివిజన్ ప్రజలు సహకరించాలని కోరారు డివిజన్ సందర్శనలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ 25వ డివిజన్ కార్పొరేటర్ సిరిశెట్టి సతీష్ కుమార్ 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మ రాజుల రజిని రవి 28వ డివిజన్ కార్పొరేటర్ దారంగుల కుమార్ 27వ డివిజన్ కార్పొరేటర్ ఆయేషా వాజిద్ ఖాన్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈదునూరి హరిప్రసాద్ కాంగ్రెస్ నాయకులు బంధారపు బుగ్గ రాములు గౌడ్ ఎస్.కె ఇస్తా కార్ వడ్డేపల్లి సురేష్ బల్వన్ సింగ్ మహమ్మద్ కిరణ్ గౌడ్ ఆరిఫ్ బాయ్ పిల్లిసూరి సానగొండ లక్ష్మణ్ ఇసంపల్లి తిరుపతి వినోద్ అంజద్ నగరపాలక సంస్థ ఏఈ తేజస్వినిటిపిఎస్ నవీన్‌సానిటరీ ఇన్స్పెక్టర్‌సంపత్‌జూనియర్‌అసిస్టెంట్ చంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

## ఒలింపిక్ డే రన్‌తో వనపర్తిలో క్రీడా స్ఫూర్తి వెల్లివిరిసింది

- యువత క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది : జిల్లెల చిన్నారెడ్డి
- ప్రతిరోజూ వ్యాయామంతో శారీరక, మానసిక దృఢత్వం సాధ్యం : అదనపు ఎస్పీ రాజేష్ మీనా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూన్ 22 : ప్రపంచ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన 40వ ఒలింపిక్ డే రన్ ఉత్సాహభరితంగా సాగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్ క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అంబేద్కర్ చౌక్, రాజీవ్ చౌరస్తా, బస్ డిపో మీదుగా పాలిటెక్నిక్ కళాశాల వరకు నిర్వహించిన రన్‌లో విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారుల ను ప్రోత్సహించేందుకు విస్తృత అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రతి గ్రామం, ప్రతి పాఠశాలలో క్రీడా సంస్కృతి పెంపొందితేనే భవిష్యత్ ఒలింపియన్లు తయారవుతారని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణ కలిగిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అదనపు ఎస్పీ రాజేష్ మీనా మాట్లాడుతూ, ప్రతిరోజూ కనీసం గంటపాటు నడక, పరుగు, యోగా లేదా ఏదైనా క్రీడలో పాల్గొనడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందన్నారు. యువత మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు పరిమితం కాకుండా క్రీడల వైపు అడుగులు వేయాలని సూచించారు. క్రీడలు యువతను చెడు వ్యసనాలు, నేరప్రవృత్తుల నుంచి దూరంగా ఉంచి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.ఎల్.ఎన్. మాధవి రమేష్, ఒలింపిక్ డే కన్వీనర్లు జిల్లెల సురేందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, బొలమోని కుమార్, స్థానిక కౌన్సిలర్ బ్రహ్మాచారి, జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ కుమార్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివాజీ, పీడీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో సౌకర్యాల పరిశీలన

- ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలి: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూన్ 22 : వనపర్తి శివారులోని చిట్యాల డబుల్ బెడ్‌రూమ్ గృహాల కాలనీలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సోమవారం కాలనీని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. కాలనీలో ప్రజలకు అందుతున్న తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు తదితర సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ ఎండీకి వివరించారు. అనంతరం ఎండీ గౌతమ్ ప్రజారోగ్య, మున్సిపల్ శాఖ అధికారులకు కాలనీలో అవసరమైన మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు ప్రభుత్వ స్థలాలను కొందరు అక్రమంగా ఆక్రమిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకురాగా, వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఎండీ ఆదేశించారు. అలాగే కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని నివాసితులు కోరగా, వీలైనంత త్వరగా చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య సమస్యల శాశ్వత పరిష్కారం కోసం సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు ఎండీ వీపీ గౌతమ్ సూచించారు. అన్ని అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి కాలనీ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, హౌసింగ్ పీడీ విఠోబా, సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ పై దాడి అమానుషం

- నిందితులను వెంటనే అరెస్ట్ చెయ్యాలి
- టియూడబ్ల్యూజే-ఐజేయు జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేక్మాల్ జూన్ 22 : ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులకు గ్రామ పంచాయతీ నోటీసులు జారీ చేసిన వార్త రాసిన మన తెలంగాణ నార్సింగి విలేకరి రాఘవేంద్రపై సోమవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టియుడబ్ల్యుజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం నార్సింగి పోలీస్ స్టేషన్ లో యూనియన్ నాయకులతో కలిసి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పత్రికా స్వేచ్ఛను హరిస్తూ నిజాలు నిగ్గు తేల్చిన జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో మంగళవారం నాడు జిల్లా వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్, తహసిల్దార్ కార్యాలయాల్లో యూనియన్ తరపున ఫిర్యాదులు చేయాలని పిలుపునిచ్చారు. పోలీసులు కాలయాపన చేసి నిందితులను అరెస్టు చేయడంలో జాప్యం చేస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని తెలిపారు.



## బాధిత మహిళలకు అండగా భరోసా కేంద్రాలు...

- సత్వర న్యాయం, పునరావాసమే లక్ష్యం
- జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూన్ 22 : జిల్లాలోని బాధిత మహిళలకు అండగా భరోసా కేంద్రాలు దోహదపడతాయని జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకాన్ అన్నారు. సోమవారం ఎస్పీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాస్థాయి కాన్వర్జెన్స్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు,పిల్లలపై హింస, వేధింపుల దుర్వినియోగానికి గురైన బాధితులకు సమగ్ర రక్షణ,సహాయం, పునరావాసం, న్యాయ సేవలు, మరింత సమర్థవంతంగా అందించేందుకే భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయని తెలిపారు. భరోసా సెంటర్ ద్వారా ఈ సంవత్సరం ఇప్పటివరకు బాధితులకు కౌన్సెలింగ్,వైద్య సహకారం,న్యాయ సహాయం, పరిహార ప్రతిపాదనలు, ఆశ్రయం,విద్యా సదుపాయాలు కల్పించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడ్డాయని,పలు పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కీలక పాత్ర పోషించిందని తెలిపారు.

## ప్రజావాణి అర్జీల ఫైల్ ట్రాకింగ్

- త్వరిత పరిష్కారమే లక్ష్యం - జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, జూన్ 22: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఫైల్ ట్రాకింగ్ చేస్తున్నామని, దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించడానికి అన్ని చర్యలుతీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 192 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోగా, కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖ వారిగా ఆన్లైన్ లో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్నామని చెప్పారు. శాఖల వారీగా దరఖాస్తుల సంఖ్య, పెండింగ్ దరఖాస్తులను సమీక్షించారు. ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డిఆర్ఓ స్వామి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఈనెల 26న హైదరాబాద్‌లో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

- పద్మశాలి ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలి
- జిల్లా అధ్యక్షుడు అనంతుల లక్ష్మీనారాయణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 22 : తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 26న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి పద్మశాలి ఉద్యోగుల సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు అనంతుల లక్ష్మీనారాయణ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు నాయకత్వంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ స్వకులశాలి సమాజ భవనంలో ఈ సదస్సు జరగనున్నట్లు ఆయన వెల్లడించారు. సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంతుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, పద్మశాలి ఉద్యోగుల సంక్షేమం, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, సంఘ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ వంటి కీలక అంశాలపై రాష్ట్ర సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పద్మశాలి ఉద్యోగులు ఒకే వేదికపై సమావేశమై పరస్పర అనుభవాలను పంచుకోవడంతో పాటు సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేసుకునేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల విస్తరణకు సదస్సు దిశానిర్దేశం చేయనుందని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పద్మశాలి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దూలం నటరాజ్, గొట్టిముక్కుల మహేందర్, పసునూతి వెంకటేశ్వర్లు, కొండి పద్మజ, పుట్ట లింగమూర్తి, దిగిదారి రాము తదితరులు పాల్గొన్నారు.



## ఒలింపిక్ డే రన్ టీ-షర్టులను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కూనంనేని

- యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి-ఒలింపిక్ స్ఫూర్తిని
- విస్తృతం చేయాలని పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూన్ 22 : అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా జూన్ 23న నిర్వహించనున్న "ఒలింపిక్ డే రన్" కార్యక్రమానికి సంబంధించిన టీ-షర్టులను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం పాల్వంచలో ఆవిష్కరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ రన్ పాల్వంచ అంబేద్కర్ సెంటర్ నుంచి మంగళవారం ఉదయం 6:30 గంటలకు ప్రారంభం కానుంది. జిల్లాలోని క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, ఒలింపిక్స్‌లో భారత్ మరింత మెరుగైన ప్రతిభ కనబర్చాలంటే యువతలో క్రీడల పట్ల ఆసక్తి, అంకితభావం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలను ప్రోత్సహించడంతో పాటు ఒలింపిక్ ఉద్యమ స్ఫూర్తిని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఒలింపిక్ డే రన్ ద్వారా యువతలో క్రీడా చైతన్యం పెరగడంతో పాటు ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన పెంపొందుతుందని, ఒలింపిక్ క్రీడల పట్ల మరింత ఆసక్తి, ప్రేరణ కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి అవసరమైన టీ-షర్టులను స్పాన్సర్ చేసిన రామదాసు (కేటీపీఎస్-టీజేఎల్ఎస్ఎస్)ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. మహిధర్, జిల్లా అథ్లెటిక్స్ కోచ్ నాగేంద్ర, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల పీడీ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు చేయాలి

- మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, జూన్ 22 :అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పారదర్శకంగా కేటాయించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మల్లారెడ్డి, వివేకానంద, బండారి లక్ష్మారెడ్డి, మర్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా నగరంలో ఒక్క కొత్త ఇల్లు కూడా నిర్మించలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500, తులం బంగారం సహా అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో పూర్తిగా విఫలమైందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిరుపేదలైన అర్హులందరికీ పారదర్శకంగా లాటరీ విధానం ద్వారా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించామని తెలిపారు. ప్రస్తుతం మిగిలి ఉన్న ఇళ్లను కాంగ్రెస్ అనుచరులకు కేటాయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, దీనివల్ల నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావు లేకుండా అర్హతనే ప్రామాణికంగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రూ.20 లక్షలతో ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని ఏమి చేసిందని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో పారదర్శకతను పాటించాలని కోరారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com